ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో లైంగిక అకృత్యాలు

- అసహజరీతిలో వేధింపులు
- 26 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యతో వెలుగులోకి
- ఇన్‌స్టాగ్రామ్‌లో సూసైడ్ నోట్, వీడియో పోస్టు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 77 | విజయవాడ, శుక్రవారం 17 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 17 October 2025 | Rs



అభిషేక్, మంధానకు ఐసిసి అవార్డులు

- సెప్టెంబర్ నెలకుగాను 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'కు ఎంపిక 8లో



కర్నూలు సభలో బటన్ నొక్కి పథకాలను ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

కలిసి ముందుకు

రాష్ట్ర సామర్థ్యాన్ని మరింత పెంచుతాం

- కర్నూలు బహిరంగ సభలో ప్రధాని
- రాష్ట్రానికి నిధులు.. విభజన హామీలపై మౌనం
- మోడీని పొగడ్తలతో ముంచెత్తిన చంద్రబాబు, పవన్, లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఢిల్లీ, అమరావతి కలిసి అభివృద్ధివైపు నడుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. గురువారం ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. తొలుత ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీశైలం వెళ్లి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత సున్నిపెంట నుంచి హెలికాప్టర్ ద్వారా కర్నూలు నగర శివార్లలోని నన్నూరు టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఓపెన్ టాప్ వాహనంలో 'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ వేదికకు చేరుకున్న ఆయనను వారిద్దరూ శాలువా కప్పి సన్మానించారు. అదే వేదిక నుంచి రాష్ట్రంలో రూ.13,400 కోట్లతో చేపట్టిన పలు ప్రాజెక్టులకు మోడీ బటన్ నొక్కి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, జాతికి అంకితం చేశారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ వికసిత భారత్‌కు స్వర్ణాంధ్రప్రదేశ్ మరింత తోడ్పడనుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఎపి సామర్థ్యాన్ని మరింత పెంచబోతున్నామని తెలిపారు. ఎపి ఆత్మగౌరవానికి, సంస్కృతికి నిలయమని, సైన్స్, ఇన్నోవేషన్ కేంద్రమని, అపారమైన అవకాశాలు ఉన్నాయని, యువతకు అనంతమైన శక్తి ఉందని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారమవుతుందన్నారు. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా ఇంధన భద్రత అవసరమని, రూ.3 వేల కోట్లతో చేపట్టనున్న ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ వల్ల ఎపి ఇంధన సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. 12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పాలనలో చాలా గ్రామాల్లో కనీసం విద్యుత్ స్తంభాలు కూడా ఉండేవి కాదని, ఇప్పుడు అందరికీ విద్యుత్ అందుతోందని అన్నారు. వికసిత భారత్ లక్ష్యాన్ని వేగంగా సాధించడానికి మల్టీ మోడల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. హైవేలు, కొత్త రైల్వే లైన్లు, పరిశ్రమలకు కొత్త ఊతం ఇస్తున్నాయన్నారు.

ఎపి సామర్థ్యం యావత్ ప్రపంచం గమనిస్తోందని, రాష్ట్రంలో గూగుల్ పెద్ద పెట్టుబడిని ప్రకటించిందని తెలిపారు. గూగుల్ ఎఐ హబ్ దేశానికే కాకుండా ప్రపంచానికే సేవ చేయబోతోందని అన్నారు. చంద్రబాబు విజన్‌ను ప్రశంసించారు. ఎపి అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి కూడా చాలా అవసరమని, కర్నూలులో ప్రారంభించే ప్రాజెక్టులు సీమలోని అన్ని ప్రాంతాల వారికీ ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఓర్వకల్లు కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లలో పెరిగే పెట్టుబడులు ఉపాధి అవకాశాలను కూడా పెంచుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎపి సామర్థ్యాన్ని విస్మరించిందని, ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఎపి సిఎం చంద్రబాబు నేతృత్వంలో ఆత్మ నిర్భర భారత్‌లో రాష్ట్రం ఒక కొత్త శక్తిగా మారుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డ్రోన్ రంగంలో కర్నూలు దేశానికే గర్వకారణంగా నిలవనుందన్నారు. నిమ్మకూరులో ప్రారంభించే అడ్వాన్స్ నైట్ విజన్ ఫ్యాక్టరీతో దేశ రక్షణ రంగంలో మరో అడుగు పడిందని పేర్కొన్నారు. నవరాత్రి మొదటి రోజు నుంచి జిఎస్‌టి భారం తగ్గించామని, ఎపి ప్రజలు రూ.8 వేల కోట్లు ఆదా చేసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. జిఎస్‌టి ఉత్సవాలను స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా జరుపుకోవాలని కోరారు. మొత్తంగా ప్రధాని ప్రసంగంలో శంకుస్థాపన చేసిన, ప్రారంభించిన ప్రాజెక్టుల గురించి వివరించారు. రాష్ట్రానికి కొత్తగా నిధులు, కొత్త ప్రాజెక్టులు, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌ప్లాంటు బలోపేతం, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు తదితర అంశాల ప్రస్తావన లేకుండాపోయింది.

ఈశాన్య రుతుపవనాలతో భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో ప్రకాశం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో శుక్రవారం అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, భారీ హోర్డింగుల వద్ద నిలబడవద్దని హెచ్చరించింది. రాష్ట్రంలో గురువారం ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా అనంతసాగరంలో 31.7 మిల్లీమీటర్లు, దూబగుంటలో 27.2 మిల్లీ మీటర్లు, కడప జిల్లా కేంద్రంలో 28.5 మిల్లీ మీటర్లు, ప్రకాశం జిల్లా పొదిలిలో 25.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపింది.

వామపక్ష పార్టీల నాయకులపై నిర్బంధం

- అరెస్టులను ఖండిస్తూ నిరసన

2

50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండి

- తెలంగాణ సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన హైకోర్టు స్టేను ఎత్తివేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని, మెరిట్స్ ప్రకారమే ముందుకెళ్లాలని హైకోర్టుకు సూచించింది. ప్రభుత్వం పాత రిజర్వేషన్లు (50 శాతం) ఆధారంగా వెళ్లొచ్చని స్పష్టత ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని తీసుకురావడంపై పలువురు సవాల్ చేయగా, తెలంగాణ హైకోర్టు ఈనెల 9న స్టే విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను గురువారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ... రిజర్వేషన్లు నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. అసెంబ్లీలో అన్ని పార్టీలు బిసి రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాయని చెప్పారు. శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించి, డేటా బేస్ ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించుకోవచ్చని ఇందిరా సాహ్నీ కేసులో తొమ్మిది మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిందని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకొని... రిజర్వేషన్లు జీవో ఇచ్చే ముందు బిల్లుకు నోటిఫికేషన్ ఇచ్చారా? అని ప్రభుత్వాన్ని అడిగారు. ఇందుకు సింఘ్వీ బదులిస్తూ... గవర్నర్ బిల్లులను ఆమోదించనప్పుడు జిఒ ఇవ్వొచ్చన్న తీర్పు ఆధారంగా జీవో 9ని జారీ చేసినట్లు చెప్పారు. రిజర్వేషన్లను పెంచుతూ జీవో 9ని ఇచ్చారని, అదే రోజు ఎలక్షన్ నోటిఫికేషన్ హడావుడిగా ఇవ్వడానికి కారణమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతివాది తరపున గోపాల్ శంకర్‌నారాయణ్ వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచకూడదని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ధర్మాసనం ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.



మృతుల చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

కాలుష్యంతో చనిపోతున్నా... పట్టదా!

- కేన్సర్ బారిన పడి మృతి చెందిన మత్స్యకారుల చిత్రపటాలతో నిరసన
- బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని గంగపుత్రుల డిమాండ్

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి)

'మేమంతా కాలుష్యం బారిన పడి చనిపోతున్నా ఎవ్వరికీ పట్టడం లేదు. మళ్లీ మా నెత్తిన బల్క్ డ్రగ్ పార్కు ప్రాజెక్టు పెట్టి మరింత దు:ఖానికి కారణమవుతున్నారు' అంటూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేన్సర్, ఇతర అనారోగ్యాల బారిన పడి మృతి చెందిన మత్స్యకారుల ఫొటోలను ప్రదర్శిస్తూ గురువారం నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినదించారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 33వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్దే చేపట్టిన నిరసనలో బాధిత కుటుంబ సభ్యులు, మత్స్యకారులు మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ కంపెనీ కాలుష్యం కారణంగా కేన్సర్, శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ఇప్పటికే పలువురు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు.

ఒక్క హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా గ్రామ ప్రజలకు ఇటువంటి పరిస్థితి నెలకొందని, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే తామంతా ఎలా జీవించగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. తమ ప్రాంతంలో పర్యావరణం పూర్తిగా దెబ్బతిందని, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. పలువురు రోగాల బారిన పడి మంచాన పట్టారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పలువురు వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా ఇలా ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి తమ మనుగడ లేకుండా చేసే పనిలో ప్రభుత్వం ఉండడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తమ జీవన విధానం, ఉనికిని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రష్యా చమురు దిగుమతిదార్లపై ఏకపక్ష ఆంక్షలను సహించం

- అమెరికాకు చైనా తీవ్ర హెచ్చరిక
- ప్రతి చర్యలు తప్పవని స్పష్టీకరణ

బీజింగ్ : రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్ తదితర దేశాలపై ఆంక్షలు, సుంకాలు విధిస్తామంటూ పదేపదే బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్న అమెరికా తీరుపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయబోమంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమకు హామీ ఇచ్చారని, ఈ విషయంలో చైనా కూడా తొందరలోనే నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ గురువారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తావనకు రాగా..అమెరికా తీరుపై జియాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకపక్ష ఆంక్షలను సహించే ప్రసక్తే లేదని, తీరు మారకపోతే ప్రతి తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోవడాన్ని సమర్థించుకున్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులు చట్టబద్ధమైనవని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి ఉండదన్నారు. అమెరికా వైఖరి ఏకపక్ష బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఆర్థికపరమైన ఒత్తిళ్లకు గురిచేడమే అమెరికా ఉద్దేశ్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఒంటెద్దు పోకడల వల్ల అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పారిశ్రామిక, సరఫరా గొలుసుల భద్రత, సుస్థిరతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. రష్యాతో సహా పలు ప్రపంచ దేశాలతో చైనా సాధారణ వాణిజ్య, ఇంధన సహకారాన్ని కొనసాగిస్తోందని, ఇది పూర్తి చట్టబద్ధమైనదని జియాన్ స్పష్టం చేశారు.



చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్

రైలులో అత్యాచారం ఘటనలో పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు-పెదకూరపాడు మధ్య సంత్రగాచి ఎక్స్‌ప్రెస్‌లో మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ రాజారావు (33) సోమవారం కదులుతున్న రైలులో రాజమహేంద్రవరానికి చెందిన మహిళ (35)పై అత్యాచారానికి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

మహిళ వద్ద తస్కరించిన సెల్‌ఫోన్‌ను సత్తెనపల్లిలో ఒక దుకాణంలో నిందితుడు విక్రయించినట్లు గుర్తించి అతని కదలికలపై నిఘా ఉంచారు. సిసి కెమెరాల ఆధారంగా గుర్తించి రాజారావును తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. మేజిస్ట్రేట్ వద్ద వాంగూల్మం ఇచ్చేందుకు బాధిత మహిళను గుంటూరు రప్పించారు. విచారణ కొనసాగుతోంది. నిందితుడి అరెస్టు ఇంకా చూపలేదు. కాగా, రాజారావు గతంలో రైలులో కేరళకు చెందిన మహిళపై కూడా అత్యాచారానికి పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం.

కమ్యూనిస్టు నాయకుల అరెస్ట్ అక్రమం : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ కర్నూలు పర్యటన సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకుల అక్రమ అరెస్టును సిపిఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం కర్నూలు జిల్లా నాయకులు నిర్మలమ్మ, అలివేలమ్మ, నగర కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, సి.మహేష్, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు కె.శ్రీనివాసులు, బీసన్న, సోమన్న తదితరులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడాన్ని తప్పుబట్టారు. అదేవిధంగా సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌ను గృహనిర్భంధంలో ఉంచడం సరైంది కాదన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యక హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాతంత్రవాదులంతా ప్రభుత్వ, పోలీసు దుందుడుకు విధానాలను ఖండించాలని కోరారు.

పర్యటనతో ఒరిగిందేమీ లేదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ కర్నూలు పర్యటన సందర్భంగా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ఎపిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే 16 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం లక్ష కోట్లు అప్పులు చేయాల్సిన అవసరం ఏముందన్నారు. జిఎస్‌టి సంస్కరణల పేరుతో లేని దానిని ఉన్నట్లు చూపిస్తూ.. ప్రజలను మోసం చేస్తున్నారని, అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తూ, చంద్రబాబు అభివృద్ధి ప్రయాణం చేస్తున్నాడని ప్రధాని చెప్పడం బూటకమన్నారు. చంద్రబాబు ఏడేళ్లలో రాజధాని అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, సిఆర్‌డి భవనం తప్ప ఏమీ నిర్మించలేదని, పంటలకు మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని చెప్పారు. ప్రధాని పర్యటనకు రూ.100 కోట్లు ఖర్చు పెట్టి ఏం సాధించారో సిఎం రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని కోరారు.



కర్నూలు సభలో ప్రధాని మోడీని శాలువాతో సన్మానిస్తున్న చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్



శ్రీశైలంలో అర్చకుల నుంచి తీర్థప్రసాదం తీసుకుంటున్న ప్రధాన మోడీ

త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ : చంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి, అమరావతి బ్యూరో

త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్, కడపలో స్టీల్ ప్లాంట్ రానున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కర్నూలులో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో కలిసి నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతూ ఇప్పుడు జిఎస్‌టి సేవింగ్స్ ప్రారంభం మాత్రమేనని, భవిష్యత్తులో ఇలాంటి లాభాలు మరిన్ని చూడబోతున్నామని పేర్కొన్నారు. జిఎస్‌టి సంస్కరణలు తీసుకొచ్చినందుకు మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

మోడీలాంటి నాయకులను ఎప్పుడూ చూడలేదన్నారు. సంస్కరణల వల్ల భారత్ ప్రపంచ వ్యాప్తంగా గౌరవం పొందుతోందన్నారు. 2047 నాటికి మన దేశం ప్రపంచంలోనే నంబర్‌వన్ అవుతుందని, అది మోడీతోనే సాధ్యమని పేర్కొన్నారు సైనికంగా మన బలమేంటో ఆపరేషన్ సింధూర్ చూపించిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్ అని పేర్కొన్నారు. యుద్ధాలు, టారిఫ్‌లు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని, ఈ సమయంలో మోడీ చెప్పిన స్వదేశీ మంత్రం మనకు బ్రహ్మాస్త్రమని అన్నారు..

మోడీ కర్మయోగి : పవన్ కల్యాణ్

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా మోడీని పొగడ్తలతో ముంచెత్తారు. మోడీ నిజమైన కర్మయోగి అని అన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ 15 ఏళ్ల పాటు ఉంటుందని, ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెడుతున్నారన్నారు. జిఎస్‌టి సంస్కరణలతో పేదలు, సామాన్యులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోందన్నారు. జిఎస్‌టి తగ్గింపుతో రాష్ట్రం రూ.8 వేల కోట్ల ఆదాయం కోల్పోతుందని చెప్పినా, పేదలకు మంచి జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారని పేర్కొన్నారు. భారత్ 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కారణం ప్రధాని మోడీనే కారణమన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ శర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతంపై మంత్రి జనార్ధన రెడ్డి హర్షం

విజయవంతం కావడం పట్ల పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్త చేశారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులను ఆయన అభినందించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.13,500 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేయడానికి కర్నూలు వేదిక కావడం గర్వకాణమని ఆయన పేర్కొన్నారు.

సైడ్‌లైట్స్

- చంద్రబాబు నాయుడు ఉపన్యాసం ప్రారంభంలో జిఎస్‌టి వల్ల లాభం చేకూరిందా? లేదా తమ్ముళ్లూ... లాభం చేకూరిన వారు చేతులెత్తాలని కోరగా, జనం నుంచి స్పందన కానరాలేదు. భవిష్యత్తులోనైనా లాభం ఉంటుందని నమ్ముతున్నారా? అంటే కూడా చేతులెత్తలేదు. మోడీ... మోడీ... అని గట్టిగా చెప్పండండే మిశ్రమ స్పందన వచ్చింది.
- సభావేదికపై మోడీ అభివాదం చేస్తూ పోడియం వద్దకు వస్తున్నప్పుడు పెద్ద ఎత్తున అరుపులు కేకలు వినిపించాయి.
- మోడీ ప్రసంగం పూర్తయ్యాక అందరి మొహాల్లో నిరాశ కనబడింది.
- మోడీ ప్రసంగం ప్రారంభంలో కర్నూలు జిల్లాలోని దేవాలయాలు, దేవుళ్ల , జిల్లా పోరాట యోధుల గురించి ప్రస్తావించారు.
- వేదికపై ప్రధాని మోడీని శాలువతో సత్కరించి, మహాశివుడు ప్రతిమను జ్ఞాపికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అందించారు
- ట్రాఫిక్ జామ్ అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డా రు
- పార్కింగ్ చాలా దూరం ఉండడంతో మహిళలు, వృద్ధులు వాహనాల వద్దనే ఆగిపోయారు.
- టాయిలెట్ల దగ్గర నీళ్ల లేక ఇబ్బందులు పడ్డారు.
- వేదికపై చంద్రబాబు నాయుడుకు దగ్గు వచ్చి గొంతు బొంగురు పోవడంతో ఎంపి బైరెడ్డి శబరి పరుగున వెళ్లి ఆయన ముందు నీళ్ల పెట్టారు.
- బస్సులన్నీ మోడీ సభకు పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు
- రాష్ట్ర, జిల్లా ప్రధాన సమస్యలను ప్రధాని పట్టించుకోవాలంటూ నన్నూరు వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



సిపిఎం కర్నూలు ఓల్డ్‌సిటీ కార్యాలయంలో పోలీసుల నిర్బంధంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్



తెల్లవారుజామున సిపిఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి కర్నూలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు



సుందరయ్య సర్కిల్ దగ్గర అరెస్ట్ చేసిన నాయకులను నాల్గవ పట్టణ స్టేషన్‌లో ఉంచిన పోలీసులు



సిపిఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ఎండి.షరీఫ్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

వామపక్ష పార్టీల నాయకులపై నిర్బంధం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భారత ప్రధాని నరేంద్ర మోడీ సభను వామపక్ష పార్టీల నాయకులు అడ్డుకుంటారనే నెపంతో పోలీసులు ముందస్తు గృహనిర్భంధాలు, అరెస్టులు చేశారు. తెల్లవారుజామునే నాలుగున్నర గంటలకు వామపక్ష నాయకుల ఇళ్లను పోలీసులు ముట్టడించి గృహనిర్బంధం చేశారు. సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామలను గృహనిర్బంధం చేశారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఎం నాయకులు ఎస్ఎండి. షరీఫ్, సిఐటియు నాయకులు ప్రభాకర్, సాయిబాబా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఖాజాపాషా, సిపిఐ నగర సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, దళిత విద్యార్థి సంఘాల నాయకులను వన్‌టౌన్, త్రీ టౌన్, ఫోర్త్ టౌన్‌ల పోలీసులు అరెస్ట్ చేశారు.

అరెస్టులను ఖండిస్తూ నిరసన

వామపక్ష పార్టీల నాయకులను, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ సిపిఎం నాయకులు సుందరయ్య సర్కిల్‌లో, సిపిఐ నాయకులు త్రీటౌన్ వద్ద నిరసన తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. సుందరయ్య సర్కిల్ వద్ద నిరసన తెలిపిన సిపిఎం జిల్లా నాయకులు టి.రాముడు, సి.గురుశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, డివైఎఫ్ఐ నగర నాయకులు హుస్సేన్‌బాషను అరెస్ట్ చేసి ఫోర్త్ టౌన్‌లో ఉంచారు.



సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, ఐద్వా కర్నూలు జిల్లా అధ్యక్షులు శ్యామలను గృహనిర్బంధం చేసిన పోలీసులు



అరెస్టులపై కర్నూలులో నిరసన

సభలో తీవ్ర విషాదం

- విద్యుదాఘాతంతో జనసేన కార్యకర్త మృతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్, కర్నూలు హాస్పిటల్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభలో గురువారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రామగిరి సమీపంలో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ సభలో పాల్గొనేందుకు వచ్చిన జనసేన కార్యకర్త అర్జున్ విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... యుగంధర్ పొడవైన జెండాను సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలం వద్దకు తీసుకువచ్చారు. ఆ జెండా విద్యుత్ తీగలకు తగిలి వెంటనే ప్రమాదానికి గురయ్యారు. అక్కడికి పోలీసులు విద్యుత్ శాఖ అధికారులు చేరుకొని విద్యుత్తును నిలిపివేసి అర్జున్‌ని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మరో ఇద్దరు కార్యకర్తలు రాఘవ, కృపామృతం గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అర్జున్ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రధాన మంత్రి సభ వద్ద మరణించిన అర్జున్ కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడ్డ రాఘవ, కృపామృతంకు రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారాన్ని ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. యువకుడి మృతదేహాన్ని కర్నూలు జనరల్ హాస్పిటల్ వద్ద సందర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎమ్‌డి.ఆనంద్‌బాబు, జిల్లా నాయకులు వై.నగేష్, డి.రాఘవేంద్ర సందర్శించి నివాళులర్పించారు. అనంతరం క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న రాఘవ, కృపామృతంను పరామర్శించి వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.



కర్నూలు జిజిహెచ్‌లో అర్జున్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు పిఎస్.రాధాకృష్ణ, రామకృష్ణ, ఆనంద్‌బాబు తదితరులు

సుగాలి ప్రీతి తల్లి గృహనిర్బంధం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రధాని మంత్రి మోడీ కర్నూలు జిల్లాకు వస్తున్న సందర్భంగా సుగాలి ప్రీతి తల్లిని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. తన కుమార్తెను అత్యాచారం, హత్య చేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలని సుగాలి ప్రీతి తల్లి పార్వతి బుధవారం కలెక్టరేట్ వద్ద నిరనసన తెలిపారు. ప్రధాన మంత్రి అపాయింట్‌మెంట్ కోరారు. ఈ నేపథ్యంలో ప్రధాని సభకు ఆమె ఆకంటం కలిగిస్తారేమో అనే అనుమానంతో ఆమెను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.



కవి కొల్లూరి ఇకలేరు

- 'ఎక్స్ రే' కొల్లూరిగా సాహితీలోకానికి సేవ

ప్రజాశక్తి- విజయవాడ, అమరావతి బ్యూరో

సాహితీలోకంలో ఎక్స్ రే కొల్లూరిగా ప్రఖ్యాతి గాంచిన కొల్లూరి సూర్యనారాయణ మూర్తి (69) గురువారం సాయంత్రం తాడేపల్లిలోని ఓ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కొల్లూరి రాసిన ఓ కవిత పేరు 'ఎక్స్ రే'. ఆ పేరుతోనే సాహితీలోకంలో ప్రఖ్యాతిగాంచారు. అమలాపురంలో పుట్టి పెరిగారు. విజయవాడ వచ్చి స్థిరపడ్డారు. ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ స్థాపించి అనేక సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాటి మినీ కవితా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విజయబాబు సంపాదకత్వంలోని చిరంజీవి మాసపత్రికలో ఉపసంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. మంచి సాహిత్యాన్ని రికార్డు చేసే ప్రయత్నంలో భాగంగా కవిత్వానికి ఎక్స్ రే అవార్డులను అందజేశారు. నలభై ఏళ్లుగా ఎక్స్ రే అవార్డులను ఇచ్చిన ఘనత ఎక్స్ రే కొల్లూరికే దక్కుతుంది. తెలుగు సాహిత్యంలో ఎక్స్ రే అవార్డు తెలియని సాహితీవేత్త ఉండరంటే అతిశయోక్తి కాదు. విజయవాడలో ఎన్నో గొప్ప సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీశ్రీ విగ్రహం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు.

లయన్స్ క్లబ్‌లో చేరి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేసి కీలక పదవులను పొందారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 'జన్మభూమి' కవి సమ్మేళనం, 24 గంటలు కవి సమ్మేళనం వంటివి నిర్వహించి సాహిత్య చరిత్రలో తన ప్రత్యేకత చాటుకున్నారు. సాహిత్యసేవని కొల్లూరి ఒక గొప్ప అనుభూతిగా ఆస్వాదించేవారు. ఈ సంవత్సరమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారంతో ఆయనను సత్కరించింది. సాహిత్య సాంస్కృతిక రంగాలకు కొల్లూరి మరణం తీరని వెలితిగా మిగిలిపోతుంది.

సాహితీ స్రవంతి సంతాపం

సుదీర్ఘకాలం తెలుగు భాష, సాహిత్యాలకు విస్తృతమైన సేవ చేసి తెలుగు సాహిత్య రంగంలో విశిష్ట వ్యక్తిగా గుర్తింపు పొందిన కవి, రచయిత ఎక్స్‌రే పత్రిక వ్యవస్థాపక సంపాదకులు కొల్లూరు మృతికి సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం తెలిపింది. కొల్లూరు మృతి భాషా సాహిత్య రంగాలకు తీరని లోటని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెంగార మోహన్, కె.సత్యరంజన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచన కవిత్వాన్ని ఉన్నత శిఖరాలకు నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కొత్తతరం కవుల ప్రోత్సాహానికి ఎక్స్‌రే పత్రిక ప్రాధాన్యతనిచ్చిందని వెల్లడించారు.

కొల్లూరి మృతి పట్ల మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ, నవ్యాంధ్ర రచయితల సంఘం, తెలుగు రాష్ట్రాల్లోని పలు సాహిత్య సంస్థలు నివాళులర్పించాయి. ప్రముఖ కవులు సంతాపం ప్రకటించారు.

కూల్చివేత ఖర్చులు జమ చేశాం

- హైకోర్టుకు తెలిపిన రియల్టర్ కంపెనీ

ప్రజాశక్తి - అమరావతి

విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ సమీపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) రూల్స్‌ను ఉల్లంఘించి కట్టిన కాంపౌండ్ వాల్ కూల్చివేత ఖర్చు రూ.48.21 లక్షలను గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు జమ చేసినట్లు అవ్యాన్ రియల్టర్ కంపెనీ హైకోర్టుకు చెప్పింది. డబ్బు జమ చేసినందున ఇంకా మిగిలిన కూల్చివేత పనులు పూర్తి చేయాలని జివిఎంసిని ఆదేశించింది. బీచ్‌లో నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టానికిగాను రూ.17.46 కోట్లను నష్టపరిహారంగా చెల్లించాలన్న కేంద్రం పర్యావరణ మంత్రిత్వ శాఖ కమిటీ నివేదికపై వివరణ ఇవ్వాలని అవ్యాన్ రియల్టర్ కంపెనీని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావు బెంచ్ గురువారం ఆదేశించింది. బీచ్ వద్ద చట్ట వ్యతిరేక నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వేసిన పిల్‌పై విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది.

ప్రజల సహాయసహకారాలు అవసరం

పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాలు, వేమన సాంస్కృతిక వేదిక ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజా కళలు, సాంస్కృతిక, ఇతర సేవా కార్యక్రమాలకు వేదికలుగా నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాల్, వేమన సాంస్కృతిక వేదిక నిలుస్తాయని, అందుకు ఈ ప్రాంత ప్రజల సహాయ సహకారాలు అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ రాణిగారితోటలోని గుంటూరు బాపనయ్య భవన్‌పై నడికట్టు వెంకటసుబ్బమ్మ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాల్ శిలాఫలకాన్ని దాత వెంకట సుబ్బమ్మ, వారి కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, వేమన సాంస్కృతిక వేదికను మాజీ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి విఎంసి మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సిహెచ్.బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఎన్.హరినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ... కృష్ణలంకలో నడికట్టు పెద్ద వెంకటరెడ్డి, వెంకటశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి మెమోరియల్ హాల్‌ను, వేమన సాంస్కృతిక వేదిక మందిరాన్ని వెంకటసుబ్బమ్మ భూరి విరాళం ఇచ్చి పూర్తి చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. ప్రజలను, వారి ఆకాంక్షలను, కళలను, వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రజలే సాధనాలు ఏర్పాటు చేసుకునే అవసరం ఏర్పడిందని తెలిపారు. ఆ అవసరాన్ని ఈ వేమన సాంస్కృతిక వేదిక నెరవేరుస్తుందని తాను ఆశిస్తున్నానన్నారు. విఎంసి మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ... ప్రజాసాంస్కృతిక వేదికగా నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాలు నిలుస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ... వ్యాపార దృక్పథంతో అనేక సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్న నేటి కాలంలో యువతీయువకులకు, ప్రజలకు ఎన్ని రూపాల్లో ఉపయోగపడాలో అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా, కళా వేదికగా పెద్ద వెంకటరెడ్డి మెమోరియాల్ హాలును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పుప్పాల కృష్ణ, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడారు. ముందుగా వేమన సాంస్కృతిక వేదిక కో కన్వీనర్ తమ్మిన చంద్రశేఖర్ ముఖ్యఅతిథులను వేదిక మీదకు ఆహ్వానించారు. వేదికపై నడికట్టు పెద్ద వెంకటరెడ్డి చిత్రపటానికి కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి శర్మ, బాబూరావు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నడికట్టు పెద్ద వెంకటరెడ్డి సతీమణి, దాత వెంటక సుబ్బమ్మ, పూర్ణ చంద్రారెడ్డి, ప్రజాసంఘాల బాధ్యులు వై.కృష్ణ, ఎ.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్ శర్మ

కార్పొరేషన్ తీర్మానాల రద్దు అధికారం కమిషనర్‌కు లేదు

- కడప వ్యవహారంపై ఎమ్మెల్యే మాధవరెడ్డి అప్పీల్ డిస్మిస్ : హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి - అమరావతి

కడప మాజీ మేయర్ సురేష్ బాబు సారథ్యంలోని మున్సిపల్ కార్పొరేషన్ చేసిన తీర్మానాలను కమిషనర్ రద్దు చేసే అధికారం లేదని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కడప టిడిపి ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవరెడ్డి వేసిన అప్పీల్‌ను డివిజన్ బెంచ్ కొట్టివేసింది. కార్పొరేషన్ చేసిన తీర్మానాలను రద్దు చేసే అధికార పరిధి మునిసిపల్ కమిషనర్‌కు ఉండదన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. కార్పొరేషన్ తీర్మానాలపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకునేందుకు అధికారం ఉందని చెప్పింది. గత జూన్ 20న చేసిన కార్పొరేషన్ చేసిన తీర్మానాలను రద్దు చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని చెప్పింది. కార్పొరేషన్ తీర్మానాలపై అభ్యంతరాలుంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చని చెప్పింది. లేదా రాష్ట్ర ప్రభుత్వం సుమోటోగా స్పందించవచ్చని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావు డివిజన్ బెంచ్ గురువారం తీర్పు చెప్పింది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశ నిర్వహణ తేదీని చెప్పాలని జూన్ 30, జూలై 1న కమిషనర్ జారీ చేసిన నోటీసును కడప మేయర్ సురేష్ బాబు హైకోర్టులో సవాలు చేశారు. కార్పొరేషన్ తీర్మానాలను రద్దు చేస్తూ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేశారు. దీనిపై సింగిల్‌జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ఎమ్మెల్యే మాధవరెడ్డి అప్పీల్ చేయగా డివిజన్ బెంచ్ కొట్టివేసింది.

రైలులో పట్టుబడిన గంజాయి

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ఎక్స్‌ప్రెస్ రైలులో 4.4 కేజీల గంజాయి పట్టుబడింది. రైల్వే ఎస్ఐ జి.వెంకటాద్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తెనాలి మీదుగా వెళ్తున్న ఎర్నాకులం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి ఉన్నట్లు సమాచారం రావడంతో రైల్వే పోలీసులు నిఘా ఉంచారు. తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ సమక్షంలో రైలు తెనాలి స్టేషన్‌కు చేరగానే తనిఖీ చేశారు. ఒక బోగీలోని బ్యాగ్‌లో నాలుగు ప్యాకెట్లలో 4.4 కేజీల ఎండిన ఆకులు, పువ్వులు, గింజలతో కూడిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



అధికారులు, వ్యాపారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియా

మిర్చి రైతులకు మెరుగైన ధరలు

- యార్డును సందర్శించిన గుంటూరు కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులకు మెరుగైన ధరలు లభించేలా కృషి చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి ఆమె మిర్చి యార్డులో కార్యకలాపాలు పరిశీలించారు. రైతు నుండి ఎగుమతిదారు వరకు జరిగే ప్రక్రియను తనిఖీ చేశారు. రైతుల శ్రేయస్సుకు సహకరించి కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. బిడ్డింగ్ రూమ్‌ను పరిశీలించారు. మిర్చి యార్డులో కార్యకలాపాలను మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, యార్డు ఇన్‌ఛార్జ్ సుబ్రహ్మణ్యం, వ్యాపారులు వివరించారు. మిర్చి యార్డులో రైతులు స్వయంగా విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని వివరించారు. 415 మంది ట్రేడర్లు మిర్చి కొనుగోలు చేస్తారని కలెక్టర్‌కి వివరించారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎగుమతి ధరలు ఉంటాయన్నారు. పంట కాలంలో రెండు లక్షల బస్తాల వరకు సరుకు వస్తుందని, మిగిలిన కాలంలో ఏభై వేల బస్తాల వరకు వస్తాయని చెప్పారు. చైనా, థాయిలాండ్, కొలంబో, ఇండోనేసియా, మలేసియా తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు జరుగుతాయన్నారు. తేజ రకం ఎగుమతుల్లో ప్రధానమైనదని పేర్కొన్నారు. 334, 341 రకం స్థానిక వినియోగానికి ఉపయో గిస్తారని తెలిపారు. గత ఏడాది దిగుబడులు ఎక్కువగా ఉండటం, నాణ్యత కొంత మేర తక్కువగా ఉండటం వల్ల ధరలు తక్కువగా ఉన్నాయని వివరించారు. యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



ఇ-కోర్టును ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

మెడికల్ కాలేజీలో ఇ - కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి కర్నూలు మెడికల్ కాలేజీలో ఇ - కోర్టును డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యవస్థ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ సంబంధిత కోర్టు కేసుల్లో వారి సాక్ష్యాన్ని ఇక్కడి నుండే రాష్ట్రంలో ఏ కోర్టుకైనా ఇవ్వొచ్చన్నారు. దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని, అందరికీ చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుక, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ, డాక్టర్ సుధకుమారి, వైద్యులు నాగార్జున, కోటేశ్వరరావు, హరీష్ కుమార్, సురేఖ, సాహిల్ పాల్గొన్నారు.

రుషికొండ ప్యాలెస్‌ను సైన్స్, కల్చరల్ మ్యూజియంగా మార్చాలి: జెవివి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్ లక్ష్మణరావు, తవ్వా సురేష్ డిమాండ్ చేశారు. రుషికొండ ప్యాలెస్‌ను 'విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం - బెంగళూరు' తరహాలో అభివృద్ధి చేస్తే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణీయ కేంద్రంగా మారి, పర్యాటకరంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, యువతలో సైన్స్, పరిశోధనలపై ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, భారతీయ విభిన్న ఐకమత్య సంస్కృతి, కళా వైభవంపై అవగాహన పెంచేందుకు మ్యూజియం ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్ తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్రీయ మ్యూజియంగా అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


లోతేరులో నిరసన తెలుపుతున్న గిరిజనులు

హైడ్రోపై నిరసనల వెల్లువ

- మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు

ప్రజాశక్తి - అరకులోయ/రూరల్ (అల్లూరి జిల్లా)

తమను జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులు తమకు వద్దే వద్దంటూ అల్లూరి జిల్లా అరకులోయ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గిరిజనులు నిరసనలు చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టుల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన పలుచోట్ల సమావేశాలు జరిగాయి. లోతేరు, అడారి, అంటిపర్తి, కాగువలస, దూదుకొండి, అడ్డుమండ, పొలిగూడ, ముసిరిగూడ, వల్డిపనస, మొర్రిగుడ, చెంద్రుపోదర్, దవడగూడ, గుగ్గుడు, బస్కీ గ్రామాల్లో సాగిన ఈ నిరసనల్లో గిరిజనులు నల్ల జెండాలు, బ్యాడ్జీలతో పెద్దపెట్టున నినదించారు. ప్రధాని మోడీ కర్నూలు పర్యటనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతిస్తూ జారీ చేసిన జిఒ 2, 13, 51 లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ప్రాజెక్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట నాటకాలు ఆపాలన్నారు. రెండు నెలల నుంచి తామంతా హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తున్నప్పటికీ కూటమి సర్కారుకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హైడ్రో పనులను తాత్కాలికంగా ఆపినట్టు చెప్పారని, ఈ అంశంపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించారా.లేక గిరిజన సలహా మండలిలో చర్చించి పనులు ఆపాలని తీర్మానం చేశారా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఆదివాసీల నిరసనలకు అనుమతి లేదని చెబుతున్నారని, హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాల కోసం ఒప్పందాలను ఎవరిని అడిగి చేసుకున్నారని ప్రశ్నించారు. నవయుగ, అదాని, షిరిడీసాయి, మేఘా కంపెనీల లబ్ధి కోసం గిరిజనుల ప్రాణాలను, అడవిని ఫణంగా పెట్టడం దారుణమన్నారు. ఆయా చోట్ల జరిగిన నిరసనల్లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, హైడ్రో పవర్ ప్రాజెక్టుల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నొబో, బి దశరథ్, కె రామారావు, నర్సింగ్, రామచంద్ర, సింహాద్రి, కె స్వామి, డి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

3 రోజుల్లో రూ.1.22 కోట్ల ఆదాయం

- విజయవాడ రైల్వే డివిజన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్‌లో భాగంగా మూడు రోజుల టికెట్ తనిఖీల ఆదాయం రూ.1.22 కోట్లు వసూలు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ టికెట్ లేని ప్రయాణానికి సంబంధించి 7,928 కేసులు, అక్రమ ప్రయాణానికి సంబంధించి 9,034 కేసులు, లగేజి బుక్ చేయని కేసులు 55 నమోదు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో గతంలో ఎన్నడూ వసూలు చేయనంత జరిమానా వసూలు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటెన్సివ్ డ్రైవ్‌లో రైళ్లు, స్టేషన్లలో ప్రతి రోజు 716 మంది టికెట్ తనిఖీ సిబ్బంది పని చేశారని విజయవాడ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు.

డిప్లమా విద్యార్థి ఆత్మహత్య

- తోటి విద్యార్థులు ఆందోళన


రోదిస్తున్న విద్యార్థి తల్లి


ఉదయ్ కిరణ్

ప్రజాశక్తి-కొడవలూరు

టీచర్ మందలించారని మనస్తాపంతో డిప్లమా విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన ఉదయ్ కిరణ్ (19) కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలోని వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం డిప్లమా చదువుతున్నాడు. ల్యాప్‌టాప్ దొంగిలించాడనే నెపంతో ఉదయ్ కిరణ్‌ను కళాశాల ఇన్‌ఛార్జ్ అనూష మందలించి అవమానపరిచారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ బుధవారం రాత్రి హాస్టల్ రూమ్‌లో ఎవరూ లేనిసమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాలకు చేరుకున్న ఉదయ్ కిరణ్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటనపై విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఉదయ్ కిరణ్ ఆత్మహత్యకు కారణమైన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. సిఐ సురేంద్రబాబు కలుగుచేసుకొని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఉదయ్ కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

18న 'ప్రభుత్వరంగం - సామాజిక న్యాయం' సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' అన్న అంశంపై ఈ నెల 18న విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తెలిపారు. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి ఐదు రోజులపాటు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత మహాసభ జరగనుందని, అందులో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యులు, డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు కె రాధాకృష్ణన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పాల్గొంటారని చెప్పారు. దేశంలో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలపై దాడులు, గ్రామ బహిష్కరణలు, మహిళలపై అత్యాచారాలు యథేచ్ఛగా జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కారు ప్రభుత్వ రంగంలో ఒక్క పరిశ్రమను కూడా నిర్మించకపోగా ఉన్న పరిశ్రమల్లోని శాశ్వత ఉద్యోగులను తొలగిస్తోందని వివరించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లు ప్రభుత్వ రంగంలోనే ఉంటాయి గనుక ఆ రంగాన్ని కాపాడుకోవాల్సి ఉందని తెలిపారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం కృషి చేసినప్పుడే సామాజిక న్యాయం అమలు జరుగుతుందని చెప్పారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలు లాభాలపైనే దృష్టి పెడతాయి తప్ప కార్మిక సంక్షేమం వారికి పట్టదన్నారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో అనకాపల్లిలో ఆశాల రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - అనకాపల్లి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఐదో రాష్ట్ర మహాసభ నవంబర్ 8, 9 తేదీల్లో అనకాపల్లి లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శాంతి, వి.సత్యవతి గురువారం తెలిపారు. ఈ మేరకు అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 ఏళ్లు అయిందని, నాటి నుంచి ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. హెచ్ఐవి, క్షయ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేస్తూ, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఫలితంగా మాతా శిశుమరణాలు తగ్గి ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 300 మంది ప్రతినిధులు, ఆశా వర్కర్స్ యూనియన్ అఖిల భారత నాయకులు హాజరవుతారని తెలిపారు. మహాసభ జయప్రదానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఇ.పార్వతి, కార్యదర్శి ఎం.సూర్యకళ పాల్గొన్నారు.

భూ సమీకరణకు 40.25 ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఉండవల్లి, పెనుమాక రైతులు సిఆర్‌డిఏకు 40.25 ఎకరాల భూమిని ఇచ్చారు. సిఆర్‌డిఏ కమిషనర్ కె.కన్నబాబు గురువారం రెండు గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు, ఇతర రోడ్ల నిర్మాణం జరిగే ప్రాంతంలో ఇంకా పూలింగుకు ఇవ్వాల్సిన భూమి ఉందని, వాటిని కూడా ఇస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. భూ సమీకరణ అవసరాన్ని, ప్రాజెక్టు పూర్తయితే వచ్చే ఫలితాలను వారికి తెలిపారు. దీంతో భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. ఉండవల్లిలో 22 మంది రైతులు 12 ఎకరాలను, పెనుమాకలో కొండవీటివాగు, ఇతర రోడ్ల నిర్మాణానికి అవసరమైన 28.25 ఎకరాలను సిఆర్‌డిఏకు భూ సమీకరణకు ఇస్తూ అగ్రిమెంటు చేసుకున్నారు. దీంతో సీడ్ యాక్సెస్‌రోడ్డు పనులు పూర్తవుతాయని, కరకట్ట విస్తరణ పనులకూ మార్గం సుగమం అవుతుందని కమిషనర్ కన్నబాబు తెలిపారు. వీటితోపాటు పెనుమాక పరిధిలో ఉన్న ఇతర రోడ్లు, కొండవీటివాగు గ్రావిటీ కెనాల్ పనులూ ప్రారంభిస్తామని అన్నారు. భూములు ఇచ్చిన రైతులకు కమిషనర్ అభినందనలు తెలిపారు.

రాయలసీమకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన
- గాంధీ విగ్రహానికి వినతి


గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాయలసీమకు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన కడప జిల్లా ఐటిఐ సర్కిల్ వద్దనున్న గాంధీ విగ్రహం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ మాట్లాడుతూ కార్యక్రమానికి పోలీసులు అనుమతి కోరినా ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరించడం సమంజసంకాదని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామని చెప్పినా పోలీసులు అంగీకరించకుండా తమ పార్టీ జెండాలు, బ్యానర్‌ను లాక్కోవడం సరైనది కాదన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, అందుకే తమ పార్టీ నిరసనకు పిలుపునిచ్చిందని తెలిపారు. కర్నూలు పర్యటనకు వస్తున్న మోడీ 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా కడప ఉక్కు ఫ్యాక్టరీని ఆరు నెలల్లో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంలో టిడిపి, జనసేన బిజెపికి తొత్తులుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంకుశ విధానాల ద్వారా ప్రజా పోరాటాలను అణచివేయాలని చూడడం సరికాదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేస్తామని మోడీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమకు రూ.20 వేల కోట్ల ప్యాకేజీని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో రానున్న కాలంలో ఈ హామీల అమలు కోసం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, రవి, నరసింహ, జార్జి, గోవిందు, తిమ్మయ్య, విజయ్,రఘు, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాణిజ్య లోటు

- సెప్టెంబర్‌లో రెట్టింపు
- 17 శాతం పెరిగిన దిగుమతులు



న్యూఢిల్లీ : భారత వాణిజ్య లోటు అమాంతం పెరిగి ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ఎగుమతుల కంటే దిగుమతులు భారీగా పెరగడంతో ఈ లోటు ఏర్పడింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణంకాల ప్రకారం.. ఏడాదికేడాదితో పోల్చితే 2025 సెప్టెంబర్‌లో భారత ఎగుమతులు స్వల్పంగా 0.8 శాతం పెరిగి 67.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 11.3 శాతం ఎగిసి 83.8 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 16.6 బిలియన్లకు ఎగిసింది. గతేడాది ఇదే మాసంలో లోటు 8.6 బిలియన్లుగా ఉంది. దీంతో పోల్చితే వాణిజ్య లోటు రెట్టింపు అయ్యింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం అధిక సుంకాలను విధించడం ద్వారా భారత ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాది మేలో అమెరికాకు 8.8 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరగ్గా.. సెప్టెంబర్‌లో 5.5 బిలియన్లకు పడిపోయాయి. అయినప్పటికీ ఎలాంటి ఆందోళన అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొనడం గమనార్హం. మరోవైపు బంగారం, వెండి, ఎరువులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగుమతులు భారీగా పెరిగాయని వాణిజ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో భారత ఎగుమతులు 4.45 శాతం పెరిగి 413.3 బిలియన్ డాలర్లుగా ఉండగా.. దిగుమతులు 3.55 శాతం పెరిగి 472.8 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి.

16 వేల ఉద్యోగులపై నెస్లే వేటు

- వచ్చే రెండేళ్లలో తొలగింపులు



వాషింగ్టన్ : ప్రముఖ గ్లోబల్ ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీ నెస్లే తమ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. వచ్చే రెండేళ్లలో 16,000 మంది సిబ్బందిని ఇంటికి పంపించనున్నట్లు ఆ కంపెనీ సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ వెల్లడించారు. ఇందుకోసం కసరత్తు చేస్తోన్నామన్నారు. ప్రపంచం మారుతోందని.. దానికి తగ్గట్లే వేగంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇది కఠిమైన నిర్ణయమే అయినప్పటికీ మార్పులో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కుదించుకుంటున్నామన్నారు. ఉత్పత్తి, సరఫరా విభాగాల్లో ఇప్పటికే 4 వేల మంది ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. దాంతోపాటు మరో 12 వేల మంది వైట్‌కాలర్ సిబ్బందిపై వేటు పడనుందన్నారు. ఈ కోత వల్ల సంస్థకు ఒక బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ (దాదాపు రూ.11వేల కోట్లు) ఆదా కానున్నాయి. 2027 నాటికి దాదాపు రూ.33వేల కోట్లు ఆదా చేసుకోవలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇన్ఫోసిస్ ఒక్కో షేర్‌పై రూ.23 డివిడెండ్

- క్యూ2 లాభాల్లో 13.2 శాతం వృద్ధి

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ తమ వాటాదారులకు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.23 చెల్లించేందుకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీనికి అక్టోబర్ 27వ తేదిని రికార్డ్ తేదిగా నిర్ణయించగా.. నవంబర్ 7న చెల్లింపులు చేయనున్నట్లు ఆ కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఇన్ఫోసిస్ 13 శాతం వృద్ధితో రూ.7,364 కోట్లుగా నమోదయ్యింది. రెవెన్యూ 9 శాతం పెరిగి 44,,490 కోట్లకు చేరింది. వరుసగా రెండు త్రైమాసికాల్లో మెరుగైన వృద్ధిని సాధించామని ఆ కంపెనీ సిఇఒ, ఎండి సలీల్ పరేక్ తెలిపారు.

ఎటర్నల్ రెవెన్యూ 183 శాతం వృద్ధి

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో మాతృసంస్థ ఎటర్నల్ రెవెన్యూ భారీగా పెరిగింది. 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో సంస్థ లాభాలు 63 శాతం తగ్గి రూ.65 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.176 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.4,799 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో ఏకంగా 183 శాతం పెరిగి రూ.13,590 కోట్లకు చేరింది.

ఇండియన్ బ్యాంక్ ఫలితాలు ఆకర్షణీయం



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 11.53 శాతం వృద్ధితో రూ.3,018 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,706 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.11,125 కోట్లుగా ఉన్న వడ్డీ ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.11,964 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.40 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే సెప్టెంబర్ ముగింపు నాటికి 3.48 జిఎన్‌పిఎ చోటు చేసుకుంది.

ఐదేళ్ల గరిష్టానికి పండ్ల ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : దేశంలో పండ్ల ధరలు భగ్గుమంటున్నాయి. 2025 తొలి తొమ్మిది మాసాల్లో పండ్ల ద్రవ్యోల్బణం సగటున 13.2 శాతం పెరిగింది. గడిచిన ఐదేళ్లలో ఇదే అత్యధికం కావడం ఆందోళనకరం. 2024లో పండ్ల ద్రవ్యోల్బణం 5.9 శాతంగా, 2023లో 3.9 శాతంగా నమోదయ్యింది. ఈ ఏడాది ఒక్క సారిగా ధరలు ఎగిశాయి. గడిచిన జనవరి నుంచి సెప్టెంబర్ సమయంలో అరటి పండ్ల ధరల ద్రవ్యోల్బణం సగటున 8.1 శాతం పెరిగింది. గతేడాది ఈ పండ్లు 6.1 శాతం ప్రియమయ్యాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలో అధిక వరదలతో పంటలు నాశనం అయ్యాయి. దీంతో సరఫరాపై ప్రభావం పడి పండ్ల ధరలు పెరిగినట్లు ఆ వ్యాపార వర్గాలు తెలిపాయి.

విప్రోకు రూ.3,246 కోట్ల నికర లాభాలు

బెంగళూరు : ప్రముఖ ఐటి సేవల కంపెనీ విప్రో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.3,246.2 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.3,208 కోట్ల లాభాలతో పోల్చితే స్వల్పంగా పెరిగాయి. మరోవైపు గడిచిన క్యూ2లో కంపెనీ రెవెన్యూ 1.7 శాతం వృద్ధితో రూ.22,697.3 కోట్లుగా నమోదయ్యాయి. తమ రెవెన్యూ బలంగా ఉందని విప్రో సిఇఒ, ఎండి శ్రీని పలియా పేర్కొన్నారు. తమ క్లయింట్లకు విప్రో ఇంటిలిజెన్సీని తెస్తోన్నందుకు సంతోషంగా ఉందన్నారు.

నేటి యువతే దేశ అఖండ సంపద

- యువతరంగ్'లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నరసింగరావు

ప్రజాశక్తి - ఎస్‌యువి క్యాంపస్

నేటి యువతే దేశానికి నిజమైన అఖండ సంపదని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు అన్నారు. ఎస్‌వియులోని స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే యువతరంగ్ - 2025 కార్యక్రమం గురువారం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించారు.

ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. మానవ జీవితానికి కళలు, సాహిత్యం వంటివి అవసరమని, అవి మనిషిని ఆదర్శంగా మారుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు కళలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. క్రీడా, సాంస్కృతిక రంగాల్లో యూనివర్సిటీ మంచి గుర్తింపును సంతరించుకోవడం శుభపరిణామమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ తాను యూనివర్సిటీలో చదువుకునే సమయంలో యూత్ ఫెస్టివల్ ఎంతో ఆనందాన్ని ఇచ్చేదని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ యువతరంగ్ - 2025 ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైందని తెలిపారు. ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. తొలినాళ్లలో తనకు లక్ష్యం ఏమిటో అర్థం కాలేదని, పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, కళాకారుడిగా రాణిస్తానని నమ్మకం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ చెంద్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బివి మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఉదయం 9.30 గంటలకు యువతరంగ్ - 2025 ప్రారంభ సూచికగా యూనివర్సిటీలో భారీ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం వరకూ కళా బృందాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. వివిధ రకాల వేషధారణలతో కళా ప్రదర్శనలతో కళాకారులు అందరినీ ఆకట్టుకున్నారు.

మధ్యాహ్నం మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలను న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేస్తారు.

ప్యాలియేటివ్ పిజి డిగ్రీ కోర్సుకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక చికిత్సా విధానం, నైపుణ్యాలతో కూడిన ప్యాలియేటివ్ కేర్ కు సంబంధించి పిజి డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతించినట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి, చికిత్సా కేంద్రంలో ఈ కోర్సు ప్రవేశపెట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ ఆమోదం తెలిపినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో తొలిసారి ప్రారంభించనున్న ఈ కోర్సులో 4 పిజి సీట్లలో ప్రవేశాలు జరగనున్నట్లు వెల్లడించింది. క్యాన్సర్ వంటి కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించినప్పుడు రోగులు విపరీతమైన నొప్పి, బాధ వల్ల వారిలో జీవన నాణ్యత తగ్గిపోతుందని, అటువంటి వాటి నుంచి ఉపశమనం కల్పించి రోగుల జీవన నాణ్యతను పెంచేందుకు తగిన మందుల వినియోగం, మానసిక సలహాలు, కుటుంబ సభ్యుల సహాయం, ఫిజియోథెరపి ఉపయోగపడతాయని తెలిపింది. నొప్పి తరంగాలు ప్రసరించకుండా చేయడం కూడా ఈ చికిత్సలో అంగర్భాగమని, ఆధునిక సమగ్ర చికిత్సా విధానాలను పిజి కోర్సులతో విస్తరింపజేయడానికి ముందుకు వచ్చిన హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి, చికిత్సా కేంద్ర నిర్వాహకులను మంత్రి అభినందించినట్లు తెలిపింది.

సంపాదకీయం

ప్రయి'వేటు'కు పగ్గాలు!

ఎలాంటి అడ్డదారులు తొక్కయినా ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటుపరం చేయాలని పగ పట్టినట్టు పన్నాగాలకు తెగిస్తోంది కేంద్ర ప్రభుత్వం! ఈ ప్రయత్నాల వరసలో తాజా కుతంత్రమే బ్యాంకుల ఉన్నత స్థానాల్లో ప్రయివేటు వ్యక్తులను కూర్చోబెట్టాలని చేసిన నిర్ణయం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో మేనేజింగ్ డైరెక్టర్ (ఎమ్డీ) పదవిలోకి నేరుగా ప్రయివేటు వ్యక్తిని నియమించటం ద్వారా ఈ ప్రక్రియను ఆరంభించాలని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. ఏ సంస్థలోనైనా దశాబ్దాలు తరబడిన అనుభవమూ, సంస్థాగతమైన అనుబంధమూ ఉన్న నిపుణులు ఉన్నత స్థానాల్లో నియమితులై, సంస్థ అభివృద్ధికి పాటు పడడం సహజం. మన ప్రభుత్వ బ్యాంకింగు రంగమూ ఇన్నేళ్లూ అలాగే నడుస్తూ, ఎదుగుతూ వచ్చింది. అలాంటి చోట ఆ సంస్థతో ఎలాంటి సంబంధమూ లేని వ్యక్తులను తీసుకొచ్చి, ఉన్నత స్థానాల్లో ఆసీనులను చేయటం ఎవరిని ఉద్ధరించటానికి? ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రయివేటు పెత్తనానికి గొడుగులెత్తటం ఎవరి ప్రయోజనాలు నెరవేర్చటానికి? మోడీ ప్రభుత్వం చాలా కాలంగా ప్రభుత్వ బ్యాంకులను ప్రయివేటుపరం చేయటానికి ఉబలాటపడుతోంది. మన దేశ నిర్దేశిత విధానాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు అడ్డుపడుతుండటంతో- ఏదో ఒక రూపంలో తన పంతం నెగ్గించుకోవటానికి ఇప్పుడు కొత్త ఎత్తుగడ వేసింది. విదేశీ ఫైనాన్స్ సంస్థలకు, కార్పొరేటు శక్తులకు మన బ్యాంకులను అనుకూల వేదికలుగా మార్చటానికే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న చట్టాల్లో ఎలాంటి మార్పులూ చేయకుండానే ఏకపక్షంగా ఉత్తర్వులివ్వటం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని బ్యాంకు సంఘాలు పేర్కొంటున్నాయి.

దేశ సామాన్య ప్రజల వ్యాపార, వ్యవసాయ, మదుపు పొదుపు అవసరాలన్నిటినీ- అత్యంత ఆవశ్యకంగా నెరవేర్చే ఉద్దేశంతోనే బ్యాంకుల జాతీయాకరణ జరిగింది. ఆ దిశగా కృషి చేస్తూ జాతీయ బ్యాంకులు అంచెలంచెలుగా విస్తరించాయి. ఏటా రూ.250 లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తున్నాయి. ఇంత బలంగా, స్థిరంగా నడుస్తున్న బ్యాంకింగు రంగాన్ని నిర్వీర్యం చేయటానికి నయా ఉదారవాద కాలంలో చాలా అడ్డగోలు విధానాలు ప్రవేశించాయి. అనేక ప్రయివేటు, కార్పొరేటు బ్యాంకులు రంగంలోకి వచ్చాయి. అవన్నీ బడా బాబుల సేవలో తరిస్తుంటే- ఇప్పటికీ మధ్య తరగతికి, రైతాంగానికి, మహిళలకు తక్కువ వడ్డీ రుణాలను ప్రభుత్వ రంగ బ్యాంకులే సమకూరుస్తున్నాయి. వివిధ ప్రభుత్వ, ప్రయివేటు వ్యవస్థల స్థాపనకు, నిర్వహణకూ నిధులను అందిస్తున్నాయి. రాజకీయ అండ ఉన్న పారిశ్రామికవేత్తలు వేల కోట్ల రుణాలను ఎగవేయటం, ఆ మొత్తాలను బ్యాంకులు మాఫీ చేసి, ఉపశమనం కలిగించటం పాలక పెద్దల ఒత్తిళ్లతో సాగుతోంది. అలాంటి నిర్ణయాలకు ఎలాంటి అడ్డంకీ లేకుండా ఇప్పుడు తీసుకొచ్చిన ప్రయివేటు పెత్తనం ఉపయోగపడుతుంది.

వడ్డించిన విస్తరి లాంటి ప్రభుత్వరంగ బ్యాంకింగ్‌లోకి ప్రవేశించటానికి విదేశీ ఫైనాన్స్ సంస్థలు చాలా కాలంగా ఆత్రుత పడుతున్నాయి. మన బ్యాంకింగ్‌లో విదేశీ సంస్థలకు 15 శాతం వరకూ వాటా ఉండొచ్చనన్న సడలింపును ఉదారవాద విధానాల్లో భాగంగా తీసుకొచ్చారు. ఇప్పుడు దానిని కూడా తోసిరాజని ఐడిబిఐని ఒక విదేశీ సంస్థకు అమ్మటానికి ఇటీవల ప్రయత్నాలు జరిగాయి. కేథలిక్ సిరియన్ బ్యాంకులో 51 శాతం వాటాలను ఫెయిర్ ఫాక్స్ అనే విదేశీ సంస్థ రూ.1200 కోట్లకు కైవశం చేసుకొంది. కొద్ది రోజులకే తన వాటాలో 9.72 శాతాన్ని రూ.600 కోట్లకు అమ్ముకొంది. లాభాల కోసమే పెట్టుబడి అన్న వ్యాపార సంచలత మన బ్యాంకింగ్ వ్యవస్థ సామాజిక బాధ్యతను చాలా వేగంగా నిర్వీర్యం చేసే ప్రమాదం ఉంది. 2008 నాటి అమెరికా సంక్షోభంలో బ్యాంకుల పతనం గురించి తెలిసిందే! అప్పట్లో ఆ సెగ ఎంతమాత్రం మన దేశానికి తగలకపోటానికి కారణం సుస్థిరమైన, భద్రమైన మన బ్యాంకింగ్ విధానమే! విదేశీ సంస్థలకు, కార్పొరేట్లకు స్థానం కల్పిస్తే ఆ భద్రతకు భంగం కలుగుతుంది. ప్రజలతో, రైతులతో, చిన్న వ్యాపారులతో ఉన్న సహకార బంధం తెగిపోయే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి- బ్యాంకులను నిర్వీర్యం చేసే ప్రయివేటు చొరబాటును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలి.

మంచి మాట



ఇంట్లో న్యాయం, సమానత్వం పాటించకుండా...
అవి ప్రజా జీవితంలో మాత్రం ఉండాలని ఆశించలేం.
ఇంట్లో అణచివేతకు పాల్పడే పురుషుడు...
వీధి లోకి, చట్టసభల లోకి, న్యాయస్థానాల లోకి వచ్చే సరికి
హఠాత్తుగా మారిపోయి సాధువు కాలేడు.

- సుబ్రమణ్య భారతి, సంఘ సంస్కర్త.

విశ్లేషణ

దగ్గు మందు మరణాలకు కారణం

లాభాపేక్షా! నిర్లక్ష్యమా?

ఎస్. కృష్ణస్వామి



రెండు రాష్ట్రాల్లో రెండు మందుల కంపెనీలు తయారు చేస్తున్న దగ్గు మందుల నాణ్యతను పరిశీలించి నిగ్గు తేల్చడంలో డ్రగ్ కంట్రోలర్ వైఫల్యంతో పాటు మందుల కంపెనీల నిర్లక్ష్యం బట్టబయలైంది. దీనికి తోడు ఒక రాష్ట్రంలో దగ్గు మందులో కల్తీ జరిగిందని నిర్ధారణ అయిన తర్వాత కూడా... కేంద్ర ప్రభుత్వం హడావుడిగా ఈ కంపెనీల మందులకు క్లీన్ చిట్ ఇవ్వడం... ప్రజారోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతున్నది. కేంద్ర ప్రభుత్వ వాదన ప్రకారం దగ్గు మందులో కల్తీ జరగలేదన్నది వాస్తవమైతే ఇంతమంది పిల్లల మరణాలకు కారణం ఏమిటి?

దగ్గు మందులో డై ఇథలైన్ గ్లైకాల్ కల్తీ జరగడం మూలంగా ఇప్పటి వరకు (అక్టోబరు 8) మధ్యప్రదేశ్‌లో ఇరవై మంది, రాజస్థాన్‌లో ముగ్గురు పిల్లలు మరణించారు. శ్రేసన్ ఫార్మాస్యూటికల్ కంపెనీ తయారు చేసిన 'కోల్డ్ రిఫ్' దగ్గు మందు వాడినందున మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో 16 మంది పిల్లలు మృతి చెందారు. ఛింద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తూ ప్రైవేటుగా కూడా క్లినిక్ నడువుతున్న డాక్టర్ ప్రవీణ్ సోనీ ఈ మందు వాడమని ప్రిస్కిప్షన్ ఇచ్చినందుకుగాను ఆయనను అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని సికార్, భరత్‌పూర్ జిల్లాలలో ముగ్గురు పిల్లలు మరణించారు. ముఖ్యమంత్రి ఉచిత మందుల పథకం ద్వారా కేసన్ ఫార్మా కంపెనీ వారి జనరిక్ దగ్గు మందు వాడిన పిల్లలు అనేకమంది అస్వస్థత పాలయ్యారు. ప్రజలకు నమ్మకం కలిగించడానికి ఈ మందు తాగిన రాజస్థాన్ డాక్టర్ కొద్ది గంటల్లోనే స్పృహ కోల్పోయారు. దాంతో రాజస్థాన్ ప్రభుత్వం కేసన్ కంపెనీ సరఫరా చేసిన 19 మందుల పంపిణీని నిలిపివేసి, డ్రగ్ కంట్రోలర్‌ను సస్పెండ్ చేసింది.

అయితే కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మాత్రం జాతీయ ఏజన్సీలు సంయుక్తంగా నిర్వహించిన 'శాంపిల్స్' పరీక్షలలో డై ఇథలైన్ గ్లైకాల్ లేదా ఇథలైన్ గ్లైకాల్ అవశేషాలు ఉన్నట్లు బయటపడలేదని ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. దాంతోపాటే పిల్లలకు దగ్గు మందు వాడాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిక జారీ చేసింది. కానీ తమిళనాడు ప్రభుత్వ డ్రగ్ పరీక్షా ప్రయోగశాల నిర్వహించిన పరీక్షలో 'కోల్డ్ రిఫ్'లో డై ఇథలైన్ గ్లైకాల్ కలిసినట్లు తేలింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం కాంచీపురం జిల్లాలో శ్రేసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న 'కోల్డ్ రిఫ్'ని నిలిపివెయ్యమని ఆదేశాలు జారీచేసింది. దీనికి కొనసాగింపుగా తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు 'కోల్డ్ రిఫ్' దగ్గు మందు అమ్మకాలను, వాడకాన్ని ఆ యా రాష్ట్రాల్లో నిషేధించాయి.

రెండు రాష్ట్రాల్లో రెండు మందుల కంపెనీలు తయారు చేస్తున్న రెండు రకాల దగ్గు మందుల నాణ్యతను పరిశీలించి నిగ్గు తేల్చడంలో డ్రగ్ కంట్రోలర్ వైఫల్యంతో పాటు మందుల కంపెనీల నిర్లక్ష్యం బట్టబయలైంది. దీనికి తోడు ఒక రాష్ట్రంలో దగ్గు మందులో కల్తీ జరిగిందని నిర్ధారణ అయిన తర్వాత కూడా... కేంద్ర ప్రభుత్వం హడావుడిగా ఈ కంపెనీల మందులకు క్లీన్ చిట్ ఇవ్వడం... ప్రజారోగ్యం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతున్నది. కేంద్ర ప్రభుత్వ వాదన ప్రకారం దగ్గు మందులో కల్తీ జరగలేదన్నది వాస్తవమైతే ఇంతమంది పిల్లల మరణాలకు కారణం ఏమిటి?

డై ఇథలైన్ గ్లైకాల్ (డి.ఇ.జి) అంటే ఏమిటి?

డి.ఇ.జి అనేది తియ్యని రుచి కల్పించే రంగు లేని పారిశ్రామిక రసాయనం. దీనిని 'కూలింగ్ సిస్టమ్'లో నీరు గడ్డ కట్టకుండా ఉండడానికి, ద్రావకాల్లోనూ వినియోగిస్తుంటారు. మందులు, ఆహార పదార్థాల్లో దీనిని వినియోగించడం నిషిద్ధం. డి.ఇ.జి మానవ శరీరంలో తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తుంది. మూత్రపిండాలు, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. పిల్లల విషయంలో ఇది మరణాలకు దారితీస్తుంది. డి.ఇ.జి రంగు లేని ద్రావకం కావడం మూలాన మందులు, ఆహార పదార్థాలు ఇలా వేటిలో అయినా ఇట్టే కలసిపోతుంది. చూడడానికి గ్లిజరిన్, ప్రొపలీన్ గ్లైకాల్‌ను పోలి ఉంటుంది. ఈ రెండింటినీ మందులలో చిక్కదనానికి, తీపి రుచి రావడానికి వాడుతుంటారు. డి.ఇ.జి తో పోలిస్తే వీటి ఖరీదు ఎక్కువ. అందుకే మందుల నాణ్యతను పరీక్షించే డ్రగ్ కంట్రోలర్ వ్యవస్థలు సరిగా పనిచేయని చోట, సరఫరాల మీద సరైన నియంత్రణ లేని చోట ఫార్మా కంపెనీలు కావాలనే చౌకగా దొరికే డి.ఇ.జి ని మందుల ఉత్పత్తిలో వాడుతుంటాయి. మందుల కంపెనీల అత్యాశ రోగుల, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీస్తున్నది, వరుస మరణాలకు దారితీస్తున్నది.

గత విషాదాలు

మన మందుల కంపెనీల నిర్వాకాల మూలంగా గతంలో కూడా అనేక విషాద ఘటనలు చోటు చేసుకున్నాయి. 2022లో హర్యానా లోని మెయిడిన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తి చేసిన దగ్గు మందు సేవించి గాంబియాలో 66 మంది పిల్లలు మరణించారు. ఈ దగ్గు మందులో డి.ఇ.జి కల్తీ జరిగింది. 2022 జులై నెలలో మొదటిగా ఈ మందు వాడకం మూలంగా అస్వస్థులైన వారిని గుర్తించారు. మన దేశం నుండి ఎగుమతి అయిన దగ్గు మందులో డి.ఇ.జి కల్తీ జరిగిందని గాంబియా ఆరోగ్య మంత్రిత్వశాఖ నిర్వహించిన పరీక్షలలో తేలింది. దాంతో మెయిడిన్ ఫార్మా కంపెనీ ఉత్పత్తుల పట్ల జాగ్రత్త వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 అక్టోబరులో ప్రపంచ దేశాలన్నిటికీ హెచ్చరిక జారీ చేసింది. ఆ తర్వాత గానీ హర్యానా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలలో కదలిక రాలేదు.

గాంబియా విషాద ఉదంతం చోటు చేసుకోక మునుపే కంపెనీ ఉత్పత్తి చేస్తున్న మందులు...నాణ్యతా పరీక్షలలో విఫలమవుతూ వచ్చాయి. అయినా ఈ కంపెనీ మీద తగిన చర్యలు తీసుకోలేదు. కొన్ని మందుల లైసెన్స్‌లను కొంత కాలం పాటు నిలిపివెయ్యడంతో సరిపెట్టారు. కల్తీ మందులను వెనక్కి రప్పించడం గానీ, నాణ్యతా ప్రమాణాలు పాటించనందుకు చట్టపరంగా విచారణ జరిపి శిక్షించడానికిగానీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఒక మొట్టికాయ వేసి వదిలేశారు. మన మందుల పరిశ్రమ సురక్షితం కాని మందులను ఎగుమతి చేస్తుంది. మన నియంత్రణా వ్యవస్థ పటిష్టంగా లేదన్న వార్తలు ప్రపంచ దేశాల్లో వ్యాపించినా మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాయి.

మన దేశంలో డి.ఇ.జి కల్తీ మరణాలకు దశాబ్దాల వెనుకటి చరిత్ర ఉన్నది. 1998లో కల్తీ దగ్గు మందు వాడిన మూలాన హర్యానాలో 33 మంది పిల్లలు మృతి చెందారు. గాస్‌క్రోమోటోగ్రఫీ ద్వారా నిర్వహించిన పరీక్షలో ఈ దగ్గు మందులో డి.ఇ.జి కల్తీ జరిగినట్లు తేలింది. ఈ ఉదంతంపై జరిపిన విచారణలో నియంత్రణా లోపాలు, మెరుగైన ఉత్పత్తి విధానాలను అవలంబించేలా కంపెనీలను ఒత్తిడి చెయ్యలేని చట్టపరమైన బలహీనతలు, పరీక్షల నిర్వహణ సక్రమంగా చెయ్యకపోవడం వంటివి కల్తీకి ప్రధాన కారణాలని నిర్ధారించారు. 1986లో బొంబాయిలోని జె.జె ఆసుపత్రిలో డి.ఇ.జి కల్తీ జరిగిన గ్లిసరిన్ వాడడం వల్ల పద్నాలుగు మంది మృతి చెందారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన ఆధారాలు ఉన్నాయని, మంత్రుల ప్రమేయం కూడా ఉన్నదని, మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నివేదికలను తారుమారు చేసిందనీ ఈ విషాద ఘటనపై నియమించిన జస్టిస్ లెంటిన్ కమిషన్ నిగ్గుతేల్చింది. దరిమిలా కొంతమంది అధికారులను సస్పెండ్ చెయ్యడం మినహా తప్పులు సరిదిద్దేందుకు పాలనా పరమైన సంస్కరణలు చేపట్టలేదు.

2020లో హిమాచల్‌ప్రదేశ్‌లో డిజిటల్ విజన్ కంపెనీ ఉత్పత్తి చేసిన దగ్గు మందు తాగిన 13 మంది పిల్లలు మరణించారు. ఈ కంపెనీ ఉత్పత్తి చేసే మందులు నాసిరకంగా ఉన్నాయని గతంలో డ్రగ్ కంట్రోలర్ పలుమార్లు గుర్తించినా తాత్కాలిక సస్పెన్షన్లతో సరిపెట్టారు. తదనంతరం జరిగిన విచారణలో రికార్డులు తారుమారు చెయ్యడం, మెడికల్ గ్రేడ్ ద్రావకాలకు బదులు పారిశ్రామిక ద్రావకాలను వినియోగించడం వంటి తీవ్రమైన తప్పిదాలు బహిర్గతమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్ ఔషధ నియంత్రణ వ్యవస్థ సరైన రీతిలో పర్యవేక్షణ చేయకపోవడం, తప్పిదాలు గమనించి కూడా చర్యలు తీసుకోకపోవడం వంటి లోసుగులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నది.

మన నియంత్రణా వ్యవస్థ బలహీనంగా ఉండడం కొత్త కాదు. "మేలైన ఉత్పత్తి పద్ధతుల పేరిట అమెరికా అనుసరించే ప్రమాణాలను మన దగ్గర చట్టబద్ధం చేస్తే దేశంలోని మందుల ఉత్పత్తి పరిశ్రమలన్నీ మూతపెట్టుకోవాల్సిందే" అంటూ 2014లో అప్పటి డ్రగ్ కంట్రోలర్ జనరల్ జి.ఎన్.సింగ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. అంటే దేశంలోని దేశీయ బహుళ జాతి మందుల ఉత్పత్తి కంపెనీల లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టినా ఫర్వాలేదన్నమాట.

మందుల కల్తీలు ప్రపంచవ్యాప్తంగా జరిగేవే. కానీ దక్షిణాది దేశాల్లో ఇది చాలా హెచ్చు స్థాయిలో ఉన్నది. 2022లో గాంబియా, ఉజ్బెకిస్తాన్‌లో, 2008లో నైజీరియాలో, 2006లో పనామాలో, 1990-2000 మధ్య కాలంలో బంగ్లాదేశ్, హైతీ, భారత్, అర్జెంటీనా దేశాల్లో కల్తీ మందుల మరణాలు పెద్దఎత్తున సంభవించాయి. ఇవన్నీ దగ్గు మందులో డి.ఐ.జి కల్తీ వల్ల జరిగినవే. బలహీనమైన నియంత్రణా వ్యవస్థ, పారదర్శకత లోపించిన సరఫరా గొలుసుల మూలంగా ఈ కల్తీలకు అవకాశం ఏర్పడుతుంది.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి

ఈ మధ్యకాలంలో అమెరికా, యూరప్ దేశాల్లో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకున్న దాఖలా లేదు. దీనికి కారణం ఆ యా దేశాల్లో అమల్లో ఉన్న పటిష్టమైన నియంత్రణలు, నిర్ధారిత ప్రమాణాలే. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో మాత్రం ఇవి సర్వసాధారణ వ్యవస్థలుగా మారిపోయాయి. బలహీనమైన నియంత్రణలు, ఉన్న కొద్దిపాటి నియంత్రణలను కూడా అసమర్థంగా అమలు చేయడం, రాజకీయ-కార్పొరేట్ శక్తుల మధ్య నెలకొన్న అవినీతి బంధం, కల్తీ మందుల ఉత్పత్తిదారులపై స్వల్ప శిక్షలతో సరిపెట్టడం వంటి లొసుగులే ఇందుకు కారణం. ఇందుకు పరిష్కారంగా నిరంతర నాణ్యతా పరీక్షలు, సరఫరాలలో పారదర్శకతలు అవసరం. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పక్షపాత రహిత స్వతంత్ర, స్వయం ప్రతిపత్తిగల సంస్థలు ఈ పనులు చేపట్టాలి.

రాజస్థాన్‌లో అమలులో ఉన్న జన స్వాస్థ్య అభియాన్ మేలైన, ఆచరించదగ్గ నమూనా. తాజా దుర్ఘటనల నేపథ్యంలో క్లినికల్ స్పెషలిస్టులు, ఔషధ నిపుణులు, ప్రజారోగ్య నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులతో కూడిన ఒక తటస్థ కమిటీ ద్వారా బహిరంగ విచారణ నిర్వహించి అన్ని స్థాయిల్లో జబాబుదారీతనాన్ని నిర్ధారించాలని జన స్వస్థ్య అభియాన్ డిమాండ్ చేసింది. అంతేకాదు. ప్రభుత్వం చేపట్టాల్సిన సంస్థాగత మార్పులను కూడా సూచించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యతా పరీక్షలు నిర్వహించడం, నాణ్యతా పరీక్షల ఫలితాలను బ్యాచ్‌ల వారీగా బహిరంగపరచడంతోపాటు అదనపు జాగ్రత్తగా మందులను తిరిగి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. మందులు వికటిస్తే ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయిలో 24 / 7 అందుబాటులో ఉండేలా ఒక వ్యవస్థను నెలకొల్పాలని, ఈ వ్యవస్థ ప్రతి ఫిర్యాదుకు మూలకారణం ఏమిటో గుర్తించేదిగా ఉండాలని సూచించింది. మందులు వికటిస్తే తక్షణమే గుర్తించేలా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని, థార్డ్-పార్టీ ఆడిట్‌లు నిర్వహించాలని రాజస్థాన్ మెడికల్ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ చర్యలన్నీ చేపట్టడం ద్వారా ప్రజలలో విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేసింది.

రాష్ట్రంలో ఇప్పటికీ వేలాది మందికి ప్రాణాధారమైన ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే... పారదర్శకత, జవాబుదారీతనానికి బాధ్యత వహించాలని 'జన స్వాస్థ్య అభియాన్' డిమాండ్ చేసింది. మందులలో డి.ఇ.డి ఇథలీన్ గ్లైకాల్ కల్తీని నివారించేందుకు ఫార్మసీ ప్రమాణాలను అత్యున్నతీకరించి, ఫ్యాక్టరీ తనిఖీలు చేపట్టాలని సూచించింది. మోడీ ప్రభుత్వం డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టానికి 2023లో చేసిన సవరణలు నాణ్యతా పరీక్షలు, తనిఖీలు, అక్రమాలకు శిక్షలు వంటి అంశాలను బలహీన పరిచాయనే విమర్శ ఉన్నది. తక్కువ ప్రమాణాలతో ఉన్న మందుల ఉత్పత్తికి పాల్పడినా కేవలం జరిమానాలతో సరిపెడుతుంది ఈ చట్టం. కల్తీ మందుల విషయంలో న్యాయపరమైన విచారణ, జైలు శిక్షలు కొనసాగించాలి. డి.ఇ.జి కల్తీని శిక్షార్హమైన నేరపూరిత చర్యగా పరిగణించేలా చట్టంలో సవరణ తీసుకు రావాలి.

మందుల ఉత్పత్తిదారులు నిర్ధారిత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి. మలినాలకు, కల్తీకి అవకాశం లేని విధంగా సమగ్రమైన రీతిలో నాణ్యతా పరీక్షలు నిర్వహించాలి. లైసెన్స్ ఉన్న సంస్థల నుండి మాత్రమే మందుల ఉత్పత్తికి అవసరమయ్యే ముడి సరుకులను కొనుగోలు చేయాలి. అన్నిటికన్నా ముఖ్యంగా ఫార్మా కంపెనీలు-రాజకీయ నాయకుల మధ్య ఉన్న అవినీతి బంధాలను తెంచివేయాలి. అప్పుడే లాభాపేక్ష కన్నా ప్రజారోగ్య సంరక్షణకు ప్రాధాన్యత లభిస్తుంది. ప్రజల ఆరోగ్య భద్రతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్నిబంధంగా పూచీపడాలి.

★

కవిత్వం

వలసేనా...!

ఏముందని ఇక్కడ
మట్టిని నమ్మి పస్తులుండాలి
కట్టెను కొట్టి కూలిని నమ్మాలి
అరువు అరుపుల్ని భరించాలి.

ఏం చేయాలిక్కడ
ఎండు గడ్డిని మీదేసుకోవాలి
రాళ్ళు రప్పలతో కలిసిపోవాలి
నోరెళ్ళబెట్టి మూలకొరగాలి.

ఎన్నాళ్ళని భరించాలిక్కడ
కాళ్ళిరిసి పొయ్యిలో పెట్టుకోవాలి
ఖాళీ కుండలు నాకుతూ కూర్చోవాలి
ఒట్టి కడుపుతో నిద్ర కాయాలి.

ఎందుకుండాలిక్కడ
బువ్వ లేక గంజి కాచి తాగాలి
గుక్కబట్టి ప్రాణం నిలుపుకోవాలి
గుక్కెడు నీటికి దోసిలి పట్టాలి.

ఏం వెలగబెట్టాలి ఇక్కడ
గ్రహపాటు కోరల కింద బలైపోవాలి
చిరిగిన పేలికల్తో సర్దుకుపోవాలి
నలిగిన బతుకుల్ని మడతెట్టుకోవాలి.

ఏం సాధించాలిక్కడ
ఊపిరి ఆగిపోకముందే
వలసెళ్ళిపోయి బతుకుదాం
ఇక్కడే వుండిపోతే
కాలే కడుపుకు కొరివెట్టుకోవాలి
మాడిపోతూ బతుకును ఆర్పేయాలి.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

అత్యున్నత స్థాయిలోనూ కులవివక్ష



అండ్ర మాల్యాద్రి

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి చేసిన మనువాద న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాల్సిన అవసరం లేదా? ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం కూడా లేకపోవడం బాధాకరం కాదా? అత్యున్నత పదవులో ఉన్నవారికే ఇలాంటి అవమానాలు జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఇవి నా ఒక్కడి ప్రశ్నలు మాత్రమే కాదు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రశ్నలు కావాలి. ఈ ఘటన ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి మనువాద పాలనకు అద్దం పడుతున్నది. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు మనువాద శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ఆ దుర్మార్గపు ఆలోచనలతోనే ఇలాంటి దాడులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను జరుగుతున్నాయి. ఈ ఘటన మన దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యంతో పాటు భారత ప్రజలపై జరిగిన దుర్మార్గమైన దాడి. పాలక ప్రభుత్వాలు వీటిని అరికట్టే ప్రయత్నం చెయ్యడం లేదు. ముద్దాయిలపై కేసులు నమోదు చేసి శిక్షించడం లేదు. పైగా వారిని కాపాడే ప్రయత్నాలు చెయ్యడంతో ఇలాంటి దుర్మార్గాలు మరింతగా పెరుగుతున్నాయి. ఉన్న చట్టాలను అమలు చెయ్యకుండా పెత్తందారులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ చట్టం తన పని తాను చెయ్యాలి కదా? కనీసం విచారణ చెయ్యాలి కదా?

హర్యానా సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్‌ది ఆత్మహత్య కాదు-వ్యవస్థాగత హత్య. ఆధిపత్య కులాల హత్య. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, మోడీ, హర్యానా ప్రభుత్వాల అండతోనే మతోన్మాద కులదురహంకారులు పేట్రేగిపోతున్నారు.


పూరణ్ కుమార్ ఉన్నత స్థాయి పోలీస్ అధికారి. రాజ్యాంగం అమలు చేస్తున్న బాధ్యతాయుతమైన వ్యక్తిపైనే ఇంతటి దుర్మార్గపు కుల వివక్ష, హింస, అవమానం జరుగుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? వీరికి రక్షణ ఉందా? ఇది మన దేశంలోని లౌకిక రాజ్యాంగ విలువలపై బహిరంగ దాడి తప్ప మరోటి కాదు. ఈ విషయమై పూరణ్ భార్య పెట్టిన కేసు రిజిస్టర్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా? పైగా సదరు అధికారిని సెలవుపై పంపించడం ఏమిటి?

బిజెపి పాలనలో మతోన్మాద ఆధిపత్య కులాల వారు పోలీస్, ఇతర వ్యవస్థల్లో ఎస్.సి అధికారులు, ప్రజా ప్రతినిధులపై కులవివక్ష చూపుతూ చేస్తున్న దాడులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. వీటి నివారణకు ఏ మాత్రం కృషి చేయడం లేదు. పైగా ముద్దాయిలను కాపాడుతూ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నారు. పూరణ్ కుమార్ ఆత్మహత్యకు కేంద్రంతో పాటు హర్యానా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి, ఎస్.సి సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య విషయమై గౌరవ రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి. సుప్రీంకోర్టు సుమోటోగా కేసు చేపట్టి వాస్తవాలు రాబట్టాలి. పూరణ్ కుమార్ రాసిన తొమ్మిది పేజీల సూసైడ్ నోట్ బయట పెట్టాలి. ముద్దాయిలకు శిక్షలు వేసి, వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. భారత రాజ్యాంగంపై నమ్మకం కల్గించాలి. భారత రాజ్యాంగాన్ని కాపాడాలి. ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలి.

దేశంలో ప్రతి సంవత్సరం ఎస్.సి, ఎస్.టి లపై అత్యాచారాలు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదికలు ఘోషిస్తున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలలోనూ ఇవి అధికంగా ఉన్నాయని నివేదిక తెలుపుతున్నది. ప్రతి ఐదు నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతున్నది. అదేవిధంగా దేశంలో వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. 2019లో 4324, 2020 5098, 2021లో 5563, 2022లో 6083, 2023లో 6096 జరిగాయని నివేదికలు తెలుపుతున్నాయి. వీటి నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించడం లేదు. బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చెయ్యడం లేదు. ముద్దాయిలను కాపాడేందుకు బాధితులను బెదిరించి కౌంటర్ కేసులు పెడుతున్నారు. వీటిపై రాజ్యాంగ సంస్థలు స్పందించి వీరికి రక్షణ కల్పించి న్యాయం చెయ్యాలి. లేదంటే ప్రజలు పిడికిలి బిగిస్తారని ప్రపంచ అనుభవాలు చెబుతున్నాయి.

/ వ్యాసకర్త కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి, ఎస్.సి సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య విషయమై గౌరవ రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి. సుప్రీంకోర్టు సుమోటోగా కేసు చేపట్టి వాస్తవాలు రాబట్టాలి. పూరణ్ కుమార్ రాసిన తొమ్మిది పేజీల సూసైడ్ నోట్ బయట పెట్టాలి. ముద్దాయిలకు శిక్షలు వేసి, వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. భారత రాజ్యాంగంపై నమ్మకం కల్గించాలి. భారత రాజ్యాంగాన్ని కాపాడాలి. ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలి.

అభిప్రాయం

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నాయి. అన్ని విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో సైతం ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బెల్ట్, షూ, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అయినప్పటికీ, గ్రామాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులు అవుతున్నారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వాలు తల్లికి వందనం అందించడం కూడా ఒక కారణంగా పలువురు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. పైగా ఉపాధ్యాయుల కొరత ఉంది. ఏకోపాధ్యాయ పాఠశాలలు కూడా రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల మెగా డిఎస్సీ పేరుతో పదహారు వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినప్పటికీ, ఇంకా పది వేల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు సమాచారం. కావున ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరత లేకుండా చేయాలి. ఏకోపాధ్యాయ పాఠశాలల ద్వారా గుణాత్మక విద్య సాధ్యం కాదు. ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలి. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవచ్చు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

నెం.11/టి.1/2025-26, నిట్ నె.43 నుండి 49/ తేది: 11.10.2025

గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గములలో జడ్.పి.పి మరియు యం.పి.లాడ్స్ 2024-25 (యం.పి.యల్.ఎన్.గుంటూరు) నిధుల క్రింద మంజూరైన 7 పనులకు **అంచనా విలువ:** రూ.62.65 లక్షలకు టెండర్లు ది.18.10.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నావి.

DIPRNo: 17789/CL/ADVT/1/1/2021-22

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, (పి.ఆర్), పి.ఐ.యు డివిజన్, గుంటూరు

ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్
IKF FINANCE
హెడ్ ఆఫీసు: 40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి.రోడ్, విజయవాడ-520 010. ఫోన్ నం: 0866-2474644.

డిమాండ్ నోటీసు (సెక్షన్ 13(2))

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, **రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు 1) మెసర్స్ సహస్ర సూపర్ మార్కెట్, ప్రతినిధియైన దీని యజమాని మల్లిపెద్ది వేంకటేశ్వర రావు, 2) శ్రీ మల్లిపెద్ది వేంకటేశ్వర రావు, తండ్రి రంగారావు మల్లిపెద్ది, 3) శ్రీమతి మల్లిపెద్ది రోజ, భర్త మల్లిపెద్ది వేంకటేశ్వరరావు, 4) శ్రీమతి మల్లిపెద్ది కావ్య, తండ్రి మల్లిపెద్ది వేంకటేశ్వర రావు** అనువారు ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి పొందిన రుణాల సదుపాయాలను అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిచెందారు మరియు రుణాలు **నాన్-పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)**గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి వారి గతంలో తెలిసిన చిరునామా పై నోటీసులు జారీచేయబడినవి, కాని అవి వారికి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి అట్టి పరిస్థితుల్లో ఈ బహిరంగ ప్రకటన రూపేనా వారికి తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/ హామీదారులు పేరు: 1) మెసర్స్ సహస్ర సూపర్ మార్కెట్, ప్రతినిధియైన దీని యజమాని మల్లిపెద్ది వేంకటేశ్వర రావు, నివాసం: డోర్ నం.9-111, చౌడేశ్వరి కాలనీ క్రాస్, తడిగడప, డొంక రోడ్, ఎనమలకుదూరు గ్రామం, మసీదు దగ్గర, విజయవాడ ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520007-**రుణగ్రహీత/ అభ్యర్థి. 2) శ్రీ మల్లిపెద్ది వేంకటేశ్వర రావు, తండ్రి రంగారావు మల్లిపెద్ది,** నివాసం: డోర్ నం.64-6-10సి, ఏయిర్‌టెల్ టవర్ దగ్గర, పాత పోస్టు ఆఫీసు రోడ్డు, పటమట లంక, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520010, **3) శ్రీమతి మల్లిపెద్ది రోజ, భర్త మల్లిపెద్ది వేంకటేశ్వర రావు,** నివాసం: డోర్ నం.64-6-10సి, ఏయిర్‌టెల్ టవర్ దగ్గర, పాత పోస్టు ఆఫీసు రోడ్డు, పటమట లంక, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520010, **4) శ్రీమతి మల్లిపెద్ది కావ్య, తండ్రి మల్లిపెద్ది వేంకటేశ్వర రావు,** నివాసం: డోర్ నం.64-6-10సి, ఏయిర్‌టెల్ టవర్ దగ్గర, పాత పోస్టు ఆఫీసు రోడ్డు, పటమట లంక, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520010 **-సహ-రుణగ్రహీతలు/ సహ-అభ్యర్థులు.**

నోటీసు తేది: 15.10.2025	**ఎన్‌పిఏ తేది: 03.10.2025**

బకాయి మొత్తాలు (14.10.2025 నాటికి): రూ.54,00,070/- (రూపాయలు యాభై నాలుగు లక్షల డెబ్బై మాత్రమే)

ఆస్తి యొక్క షెడ్యూలు

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, పటమట వద్ద పటమట సబ్-రిజిస్ట్రార్ పరిధి, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో, ఆర్.ఎస్.నం.68/1 మరియు 330.5చ.గ.ల విస్తీర్ణ:తో ఖాళీ ల్యాండ్ ఇంటి డోర్ నం.64-6-10జి, అసెస్మెంట్ నం.1073217623తో ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** వడ్లమూడి ఆంజనేయులు ఆస్తి-38.6అ.లు., **దక్షిణం:** 30.0అ.ల వెడల్పు రోడ్డు మరియు ఎగ్జిక్యూటంట్ మిగతా ఆస్తి-75.0అ.లు, **పడమర:** చెన్నుపాటి సీతమ్మ ఆస్తి-41.0అ.లు, **ఉత్తరం:** పి.ఎస్.ఆర్. ప్రసాద్ ఆస్తి-75.0అ.లు.

నోటీసు మీకు అందే విధంగా చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు మరియు/ లేదా వారి హామీదారులును ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకొనుట జరుగుతుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్దవహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: విజయవాడ,
తేది: 16.10.2025.

సం/- అధీకృత అధికారి,
ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

CSB Bank
Trusted Heritage Smart Future

PUBLIC NOTICE ON AUCTION OF PLEDGED GOLD ORNAMENTS

The borrower/s in specific and interested bidders,in general, are hereby informed that on account of non-repayment of the Banks due by the borrowers as under despite the payment notice and recall/auction notice issued by the Bank, the gold ornaments pledged with the bank security by the respective borrowers for the loan availed by them will be sold in public auction on "as is where is" and "non-recourse" basis through e-auction portal https://gold.samil.in on 27th October, 2025 at 10.30 AM. The auction may be adjourned to any other later date at the discreation of the bank upon publication of the same in the Bank's notice board. The borrowers are hereby further inform that the gold ornaments will be disposed of by private sale if the public auction is not successful and if there is a further balance to be recovered thereafter, legal action will be initiated against the borrower/s for recovery of the balance amounts due to the bank. In case of diseased borrower, all conditions will be applicable to legal heirs.

S. No.	Account Name	Client ID	No.of Acc.	Bal. Outstanding as on 15/10/2025	Weight (grams)
	VIJAYAWADA				
1	Balusupati Samba Siva Rao	7705437	002	17,10,863.00	272.50
2	Ganji Bhaskararao	3032335	002	2,88,633.00	52.40
3	Gummadadala Harini	7705221	001	8,72,036.00	136.50
4	Jonnavithula Srikar	7704887	001	8,72,036.00	136.50
5	Maddala Anitha Rani	8276961	002	8,69,714.00	137.70
6	Someswara Rao Sampara	1595865	003	7,34,806.43	134.20
7	Syed Rizwana	7680571	001	1,45,655.20	22.00
8	Vamsi Repaka	4073736	001	29,963.89	5.70
	GUNTUR				
9	Bejjanki Jayasree	8283172	001	2,21,826.00	34.80
10	Bonthu Siva Jyothi	3056500	001	1,32,874.00	23.10
11	Devarapu Venkata Gandhi Chowdary	1435160	001	15,22,830.00	244.00
12	Eppala Venkata Maheswari	8283523	001	4,30,760.00	67.70
13	Gaddipati Venkata Gopi	7434942	001	5,22,416.00	83.10
14	Jagannadham Kiran	7850170	001	3,16,318.81	55.40
15	Kunchala Gopi	4217035	002	5,67,496.06	88.40
16	Kuraganti Kalyanarao	3240064	004	6,23,400.25	137.30
17	Pasupuleti Lurdhamma	7685559	001	2,48,046.81	42.60
18	Rehana Shaik	7521015	001	26,82,369.00	427.40
19	Shaik Mastan	4035879	001	4,44,919.00	70.40
20	Sukanya Jangala	7331533	001	1,26,583.09	24.10
21	Yamparala Venkata Padmaja	7849843	002	3,58,624.00	62.40
	GANNAVARAM				
22	Boddu Karthik	7791779	001	2,00,363.00	37.50
23	Chinthapalli Jhansi	8126855	001	99,507.00	17.50
24	Dasi Lakshmi Narayana Rao	8130066	001	1,36,259.00	24.00
25	Devarapalli Vidyasagar	7773376	001	2,83,804.00	45.00
26	Eede Thulasi	7749340	001	1,64,542.16	28.00
27	Pemmasani Chinna Koteswararao	7903141	001	61,738.00	11.00
28	Ranimekhala Lakshman	8138741	001	43,433.00	7.70
29	Tadiparthi Nagaraju	7718903	001	4,13,746.00	72.80
	VIJAYAWADA - GAYATRI NAGAR				
30	Aleti Nagababu	8195033	001	2,21,293.75	34.60
	CHILAKALURIPETA				
31	Shaik Hussain Jani	8127700	001	1,19,237.31	21.00
32	Shaik Nagur	5021556	001	1,27,331.35	19.25
33	Tadepalli Venkatasubbarao	10033551	001	66,131.56	10.40
34	Thota Gopala Rao	10031811	001	1,19,021.37	18.00
	RAVIPADU				
35	Bommireddy Aruna	7696832	001	13,35,478.81	240.20
36	Dasari Venkata Sai Jayesh Babu	8143042	002	15,85,956.35	240.40
37	Jada Malleswari	8280180	001	7,33,718.00	117.80
38	Jagani Radhika	7994434	001	7,51,535.00	119.90
39	Palavayi Srinivasa Rao	4813149	001	1,05,723.55	20.00
40	Ravichandra Kuraguntla	7961722	001	3,44,135.00	54.40
41	Shaik Mastan Vali	4682845	001	4,43,572.50	70.10

For more details/account wise information borrowers/interested bidders may contact respective branches and for participating in the auction, please visit/login to the e-auction portal https://gold.samil.in.

Andhra Pradesh | 17.10.2025 **Sd/- Authorized Officer, CSB Bank**

ఫారం నం. 3
(రెగ్యులేషన్-13 (1) (ఎ) చూడండి)

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, ముంబై (డిఆర్‌టి 3)
1వ అంతస్తు, ఎంటిఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవనం, సెక్టార్-30ఎ, వాషి, నవీ ముంబై-400703
కేసు నం. 0A/1590/2024
(డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993లోని రూల్ 5లోని సబ్-రూల్ (2ఎ)తో చదవబడు చట్టంలోని సెక్షన్ 19లోని సబ్-సెక్షన్ (4) కింద సమన్లు,
Exh. No. 9
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్
వర్సెస్
శివ సాయి ఎక్స్‌పోర్ట్స్ శివ కుమారి

దిగువ వారికి,
1. శ్రీ చేరుకూరి సాంబశివ రావు యొక్క చట్టబద్ధ ప్రతినిధులు డి.నం. 5 60 2 15 4 2 అశోక్ నగర్ గుంటూరు ఆంధ్రప్రదేశ్ 522002

సమ్మన్లు

OA/1590/2024 ను గౌరవనీయులైన ప్రిసైడింగ్ ఆఫీసర్/రిజిస్ట్రార్ సమక్షములో **10/12/2024**న జాబితా చేసినారు

గౌరవనీయులైన ట్రిబ్యునల్ చట్టంలోని సెక్షన్ 19(4) క్రింద మీకు వ్యతిరేకంగా దాఖలు చేసిన **రూ.1137925591.94/-** రుణాల వసూలుకి సంబంధించిన దరఖాస్తుపై సమన్లు/నోటీసు జారీ చేసినారు. (దరఖాస్తు పత్రాల కాపీలు మొదలైన వాటితో సహా జతచేయబడింది)

చట్టంలోని సెక్షన్ 19లోని సబ్-సెక్షన్ (4) ప్రకారం, మీరు ప్రతివాదులు ఈ క్రింది విధంగా ఆదేశించబడినారు:-

(i). సమన్లు అందిన ముప్పై రోజుల్లోపు ఎందుకు రిలీఫ్ ప్రేయెడ్ మంజూరు చేయకూడదో చూపించాలని

(ii). ఒరిజినల్ దరఖాస్తు యొక్క సీరియల్ నంబర్ 3ఎ క్రింద దరఖాస్తుదారు పేర్కొన్న ఆస్తులు మరియు ఆస్తులు కాకుండా ఇతర ఆస్తులు లేదా ఆస్తుల వివరాలను బహిర్గతం చేయడానికి.

(iii). సెక్యూర్డ్ ఆస్తులు లేదా సదరు ఇతర ఆస్తులతో వ్యవహరించడం లేదా తొలగించడం నుండి మీరు నిషేధించబడ్డారు మరియు ఒరిజినల్ దరఖాస్తు యొక్క సీరియల్ నంబర్ 3ఎ కింద బహిర్గతం చేయబడిన ఆస్తులు, ఆస్తుల అటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ మరియు తొలగించడం పెండింగ్‌లో ఉన్నాయి.

(iv). మీరు అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకూడదు, అతని వ్యాపారం యొక్క సాధారణ కార్యకలాపల తప్ప, సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించబడిన ఆస్తులు మరియు/లేదా అసలు దరఖాస్తు యొక్క సీరియల్ నంబర్ 3ఎ క్రింద పేర్కొన్న లేదా బహిర్గతం చేయబడిన ఇతర ఆస్తులు మరియు ఆస్తులను ట్రిబ్యునల్ వారి ముందస్తు అనుమతి లేకుండా బదిలీ చేయకూడదు.

(v). సాధారణ వ్యాపార కార్యకలాపలాలో సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు మరియు ఆస్తుల అమ్మకం ద్వారా వచ్చే అమ్మకపు ఆదాయానికి మీరు ఖాతా బాధ్యత వహించాలి మరియు సదరు ఆస్తులపై సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ని కలిగి ఉన్న బ్యాంకు లేదా ఆర్థిక సంస్థలతో నిర్వహించబడే ఖాతాలో సదరు అమ్మకపు ఆదాయాన్ని జమ చేయాలి.

దరఖాస్తుదారునికి అందించిన దాని కాపీతో వ్రాతపూర్వక ప్రకటనను దాఖలు చేయాలని మరియు **03.11.2025న ఉదయం 10:30 గంటలకు** రిజిస్ట్రార్ ముందు హాజరు కావాలని కూడా మీరు ఆదేశించబడినారు, లేనిచో మీరు లేనప్పుడు దరఖాస్తును విచారించి నిర్ణయం తీసుకుంటారు.

పేపర్ బుక్ కొరకు ఈ క్రింది వాటిని అనుసరించగలరు
https://cis.drt.gov.in/drtlive/paperbook.php?ri=202570500704 ఈ తేదీ 10.10.2025న నా చేతుల మీదుగా మరియు ట్రిబ్యునల్ ముద్రతో ఇవ్వగలరు.

సమ్మన్లు జారీ చేయడానికి అధికారం ఉన్న అధికారి సంతకం
సంజయ్ జైస్వాల్,
రిజిస్ట్రార్ DRT-III, ముంబై

ఇంకెప్పుడు పరిష్కరిస్తారు?

- సమస్యలపై రాజధాని రైతుల్లో ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిలో పనులు వేగవంతం అవుతున్న కొద్దీ రైతుల్లోనూ ఆందోళన పెరుగుతోంది. వేల కోట్ల వెచ్చించి పనులు జరుపుతున్న అధికారులు రైతుల సమస్యలపై పెద్దగా స్పందించడం లేదనే ఆగ్రహం వారిలో వ్యక్తమవుతోంది. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదని, పైగా సిఆర్‌డిఏలో ప్రతి పనికీ అవినీతి పెరిగిపోయిందని చెబుతున్నారు. ఇటీవల జరిగిన రైతుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలోనూ ఇవే అంశాలను వారు ప్రస్తావించారు. సిఆర్‌డిఏ కార్యాలయంలో ఏ చిన్న పనిచేయాలన్నా డబ్బు ముట్టజెప్పందే పని కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే వ్యవధిలో పని కొనసాగితే పది రోజుల్లో నిరవధిక కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో రైతులకు ప్లాటింగుకు ఇవ్వని భూముల్లోనూ, జాతీయ రహదారికి కేటాయించిన స్థలంలోనూ ప్లాట్లు వేసి ఇచ్చారని, వాటిని మార్చుమంటే మార్చడం లేదని చెబుతున్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ఇదే అంశాన్ని చెబుతున్నా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. తాము నివాసయోగ్యం భూములు ఇస్తున్నామని, ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొంటున్నారు. అలాగే మాస్టర్‌ప్లాన్‌లో వీధిపోట్లు వచ్చిన ప్లాట్లను లాటరీలో వినియోగించుకుందాం రైతులకు కేటాయించారని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతులు సమర్పించినా అధికారులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. తమ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు కూడా చేశారని, ప్లాటు వద్దకు వెళితే భూయజమాని ఊరుకోవడం లేదని చెబుతున్నారు. వీధిపోట్లు ప్లాట్లకు లాటరీ నిర్వహించొద్దని, వాటిని ప్రభుత్వమే ఉంచుకోవాలని గతంలో రైతులు అనేకసార్లు సూచించినా సిఆర్‌డిఏ అధికారులు పట్టించుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామకంఠాల సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని, వాటినీ పరిష్కరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమస్యలపై అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనీస స్పందన లేదని ఇటీవల జరిగిన జెఎసి సమావేశంలో రైతులు మండిపడ్డారు. సిఆర్‌డిఏ కార్యాలయంలో ఏ వినతిపత్రం సమర్పించినా వాటి పరిష్కారానికి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇదెంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు.

ముగ్గురు సభ్యుల కమిటీతో పరిష్కారమయ్యేనా ?

రాజధానిలో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఉన్నారు. 2024లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక పర్యాయాలు వారికి వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నామని, ఇప్పుడు కొత్తగా చెప్పేది ఏమి ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ కమిటీకి చట్టబద్దత కల్పిస్తే తమ వినతులు పరిష్కరిస్తే ఆమోదయోగ్యమని, అలాంటిదేమీ లేకుండా కమిటీ వేసినందువల్ల ఉపయోగం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఎంత కష్టం... ఎంత కష్టం

- ఉపాధి కోసం వలస వెళ్లి అదృశ్యం
- ఆరు నెలల తర్వాత ఆచూకీ లభ్యం
- జమ్ములో ఉన్నట్లు పోలీసుల ద్వారా ఫోన్ సమాచారం
- రప్పించేందుకు సహకరించాలని కోరినా కనికరించని అధికారులు


చిన్నారావు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కూలి కోసం... కూటి కోసం... పట్నంలో బతుకుదామని... తల్లి మాటలు చెవిన పెట్టక... బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం.. ఎంతకష్టం.. అన్నారు మహాకవి శ్రీశ్రీ. ఈ గేయం వలస కూలీల కష్టం కళ్ళముందు కనిపిస్తున్నట్టుగా ఉంటుంది. అచ్చంగా ఓ అమాయక గిరిజనుడి జీవితం కూడా అందుకు అద్దం పడుతోంది. జీవన పోరాటంలో పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం యర్రడవలస గిరిజన గ్రామంలోని కొండదొర తెగకు చెందిన బద్నాన చిన్నారావు అనే ఓ గిరిజనుడు ఉపాధి కోసం వలస వెళ్లి మోసపోయారు. నెలరోజుల క్రితం జమ్ము ప్రాంతంలోని బనిహాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆచూకీ లభించింది. అక్కడ నుంచి తమవారిని రప్పించుకుందామనుకుంటే కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, వారిలో ఇసుమంత కనికరం కనిపించలేదు. దీంతో, ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

యర్రడవలస గిరిజన గ్రామానికి చెందిన బద్నాన సిహాము, చిన్నమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చిన్నారావు పోడు వ్యవసాయం, సమీపంలో ఉన్న పెద్దగెడ్డలో చేపల వేటతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఇటీవల కాలంలో వ్యవసాయం కలిసిరావడం లేదు. చేపల వేటపై వచ్చిన ఆదాయం కుటుంబ పోషణకు సరిపోని పరిస్థితి వచ్చింది. దీంతో, కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కాని పరిస్థితి. మరోవైపు బొట్టిగా అమాయకత్వం. ఉపాధి కోసం ఎక్కడికైనా వెళ్లాలనుకున్నారు. ఈ తరుణంలోనే పొరుగున ఉన్న విజయనగరం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ద్వారా ఉంగుటూరు ప్రాంతంలో రొయ్యల చెరువుల్లో పనిచేసేందుకు వెళ్లారు. అక్కడ ఏం కష్టం వచ్చిందో? వెళ్లిన రెండు నెలల తరువాత అదృశ్యమయ్యారు. దీంతో, తీసుకెళ్లిన వ్యక్తి చిన్నారావు కనిపించడం లేదంటూ తల్లి చిన్నమ్మకు సమాచారం పంపారు. కొడుకు కనిపించడం లేదన్న వార్తతో చిన్నమ్మ గుండె చెరువైంది. ఉన్నంతలో వెతకని చోటులేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో, తల్లి మంచం పట్టింది. మరోవైపు సోదరుడు జోగారావు గంపెడు ఆశతో నాటి నుంచి వెతుకుతూనే ఉన్నారు. కాని, ఊరుగాని ఊరులో తప్పిపోవడం వల్ల ఎక్కడ వెతకాలో తెలియని పరిస్థితి. తీవ్ర మనోవ్యధకు గురైన ఆ తల్లి మనసులో ఎక్కడో ఆశ. తన కొడుకు ఎప్పటికైనా తిరిగివస్తాడని ఆ ఆశ గుండెను ఒకింత నిబ్బరాన్ని ఇచ్చింది. ఆశ, నమ్మకం అయితే ఉందిగానీ ఆచూకీ మాత్రం లేదు. ఆ ఆచూకీ కోసం ఏళ్లు గడుస్తున్నా లభించలేదు. అంతలోనే ఓ రోజు తెల్లవారుజామున మండల కేంద్రమైన పాచిపెంట పోలీస్ స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. ఎందుకో ఏమిటో.. తన కొడుకు ఆచూకీ ఏమైనా లభించిందా? అన్న ఆత్రుతతో మరోకొడుకు జోగారావుతో కలిసి వెళ్లింది. వీరితో బంధువులు కూడా కలిసి వెళ్లారు. అంతలోనే తీపి కబురు. 'మీ కొడుకు చిన్నారావు ఆచూకీ లభించింది. జమ్ము అనే కేంద్ర పాలిత ప్రాంతంలో ఉన్నట్టుగా మాకు సమాచారం అందింది. ఇదిగో ఫోటో చూడండి. ఇతనేనా మీ కొడుకు' అంటూ స్థానిక పోలీసులు ఫోటో చూపించారు. దీంతో, ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. జమ్ము ప్రాంతంలోని బనిహాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్లుగా సోహన్ సింగ్ అనే పోలీస్ అధికారి ద్వారా వచ్చిన సమాచారంతో కుటుంబం ఒకింత ఊపిరి పీల్చుకుంది. కానీ, అక్కడికి వెళ్లాలంటే వీరికి తెలుగు తప్ప ఇతర భాషలు రావు. జమ్ము వెళ్లాలంటే ఎలా బయలుదేరాలో, ఎక్కడ ఏ రైలు ఎక్కాలో కూడా చిన్నారావు కుటుంబానికి తెలియని పరిస్థితి. పైగా ఆర్థిక స్తోమత కూడా అంతంతమాత్రమే. దీంతో, ఆ కుటుంబం అచేతనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి. విషయం తెలుసుకున్న ఏపి గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబం నెలరోజుల క్రితమే అప్పటి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు ఆయన ఆధ్వర్యాన పలుమార్లు విన్నవించి, తమ కుమారుడ్ని రప్పించేందుకు ఏర్పాటు చేయాలని కోరుకున్నారు. ఇదుగో అదుగో అన్నారే తప్ప, మాట నిలబెట్టుకోలేదు. ఈలోపు కలెక్టర్ కూడా మారిపోయారు. మరోవైపు బాధితులకు అధికారులపైనా నమ్మకం సన్నగిల్లడం, ఆర్థిక ఇబ్బందులు వంటి కారణాలతో ఆ ప్రయత్నం అక్కడితో ఆగిపోయింది. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డిని కలవలేకపోయారు. మరోవైపు పోలీసులు కూడా ఆచూకీ సమాచారం ఇవ్వడానికే పరిమితమయ్యారు. చిన్నారావు కోసం ఆయన తల్లి చిన్నమ్మ కళ్లు కాయలు కాసేటట్లు ఎదురు చూస్తోంది. 'నా కొడుకు ఎక్కడ ఉన్నాడో? ఎలా ఉన్నాడో? ఏమైందో ఏమో' అని ఆమె ఏడుస్తోంది. 'ఎవరైనా చూపిస్తే బాగుండు' అన్న బెంగతో కాలం గడుపుతోంది. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు జోక్యం చేసుకొని తన కుమారుడిని సురక్షితంగా ఇంటికి చేర్చాలని ఆమె కోరుతున్నారు.

భరత్, రషీద్ సెంచరీలు

- ఆంధ్ర 470 ఆలౌట్
- ఉత్తరప్రదేశ్‌తో రంజీట్రోఫీ



కాన్పూర్ : ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో ఆంధ్ర బ్యాటర్లు కెఎస్ భరత్, రషీద్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 470పరుగులకు ఆలౌటైంది. భరత్(142), రషీద్(136) సెంచరీలతో తోడు సౌరభ్ కుమార్(31), పృథ్వీరాజ్(24)కి తోడు అభిషేక్ రెడ్డి(36), రేవంత్‌రెడ్డి(22) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో విప్‌రాజ్ నిగమ్‌కు నాలుగు, ఆకిబ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోయి 73 పరుగులు చేసింది. అభిషేక్ గోస్వామి(24) పెవీలియన్‌కు చేరగా.. కౌశిక్(31), గోయల్(17) క్రీజ్‌లో ఉన్నారు. తెలంగాణలోని ఎఐసిసిపి గ్రౌండ్‌లో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు భారీస్కోర్ నమోదు చేసింది. సాంగ్వాన్(211), ఆయుష్ సుమిత్(209) డబుల్ సెంచరీలతో రాణించడంతో ఆ జట్టు 4వికెట్ల నష్టానికి 529పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోయి 77 పరుగులు చేసింది.

మళ్లీ ఓడిన టైటాన్స్

- ప్రొ కబడ్డీ సీజన్-12



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీలో తెలుగు టైటాన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో యు ముంబతో జరిగిన హోరాహోరీ పోరులో టైటాన్స్ 26-33పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది. మ్యాచ్ ప్రారంభం నుంచి ఏ ఒక్క దశలోనూ యు ముంబాపై ఒక్క పాయింట్ ఆధిక్యతను కూడా టైటాన్స్ సాధించలేకపోయింది. ఈ మ్యాచ్‌లో స్టార్ రైడర్ భరత్ నిరాశపరిచాడు. కెప్టెన్ విజయ్ మాలిక్(10పాయింట్లు) సత్తాచాటినా.. మిగిలిన వారంతా నిరాశపరిచారు. మరోవైపు యు ముంబ జట్టులో అజిత్ చౌహాన్(8), సందీప్, అనిల్ మహ్మద్ సత్తా చాటారు. అంతకుముందు ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ టై బ్రేకర్‌లో గెలిచింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 32-32పాయింట్లతో సమంగా నిలవగా.. టై బ్రేకర్‌లో పట్నా 6, బెంగళూరు బుల్స్ 5పాయింట్లు మాత్రమే సాధించాయి.

ప్రొ కబడ్డీలో నేడు..
బెంగాల్ వారియర్స్ I పట్నా పైరేట్స్ (రాత్రి 7.30గంటలకు)
తమిళ్ తలైవాస్ I దబాంగ్ ఢిల్లీ (రాత్రి 8.30గంటలకు)
జైపూర్ పింక్ పాంథర్స్ I యుపి యోధాస్ (రాత్రి 9.30గంటలకు)

సర్వే కమిషనర్‌కు వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం జిల్లాలో అన్యాక్రాంతమైన 319 ఎకరాల వక్ఫ్ భూములను పరిరక్షించిన ఎపి సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ షిరీన్ బేగం, కార్యాలయ సిబ్బందికి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలం దేవాడ గ్రామంలో ఎన్‌టిపిసి సింహాద్రి సంస్థ ఆధీనంలో ఉన్న వక్ఫ్ భూములను ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేయగా 319.10 ఎకరాల భూమి ఎన్‌టిపిసి సంస్థ పరిధిలో అన్యాక్రాంతమైనట్లు గుర్తించి, పరిరక్షించినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఇప్పటి వరకూ రాష్ట్రంలో 479 ఎకరాల వక్ఫ్ భూమిని పరిరక్షించినట్లు తెలిపారు.

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర సం.	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	పురుషోత్తం కాకర్ల/ కాకర్ల లలితా కుమారి/ LBGTR00005298494	రుణ పత్రం/ఆస్తి పత్రంలో వివరించిన విధంగా ఆస్తి యొక్క అన్ని భాగాలు మరియు స్థలాలను కవర్ చేస్తుంది 1231 చదరపు అడుగులు ఫ్లాట్ నం. 512 అంతస్తు నం. 4 ఎస్ఎంఎస్ హైట్స్, ఎస్. నెం.: 297, కేఎల్ యూనివర్సిటీ సమీపంలో గుండిమెడ గ్రామం తాడేపల్లి, మండలం గుంటూరు జిల్లా, విజయవాడ- 520004. ఉత్తరం: మరియు ఫ్లాట్ నం. 513 దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై పడమం: ఓపెన్ టు స్కై./భౌతిక స్వాధీనం/15/10/2025న.	16.10.2021 Rs. 48,15,796.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 17 అక్టోబర్, 2025
ప్రదేశం : గుంటూరు & విజయవాడ

అధీకృత సెక్రెటరీ,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII

Ref: B1/41/2025 **ది.16-10-2025**

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య. 0.05 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా **"పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ కాలువ కొరకు కి.మీ. 103.658 దూరంలో ఇరువైపులా 6 లైన్ల వంతెన మరియు అదనపు 2 లైన్ల సర్వీస్ రోడ్ వంతెన యొక్క జాతీయ హైవే వంతెన నిర్మాణం నిమిత్తము"** భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 0.05 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా **"పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ కాలువ కొరకు కి.మీ. 103.658 దూరంలో ఇరువైపులా 6 లైన్ల వంతెన మరియు అదనపు 2 లైన్ల సర్వీస్ రోడ్ వంతెన యొక్క జాతీయ హైవే వంతెన నిర్మాణం నిమిత్తము"** అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: కాకినాడ **మండలం: తుని** **గ్రామం: చేపూరు**

క్రమ సంఖ్య	LPM నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం య.సెం.	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	సరిహద్దులు దక్షిణం	సరిహద్దులు తూర్పు	సరిహద్దులు పడమర	చెట్లు కట్టడములు వగైరా వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	1277	ప్రభుత్వ పుంజ	4.80	0.05	జి.సతీష్ నాయర్ (తండ్రి) గోపినాథ్ నాయర్	325	1278	542	544	మామిడి-5, టేకు-2,వేప-1, మునగ చెట్లు-3
		మొత్తం:	4.80	0.05						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టంలోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **కె.సతీష్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణాధికారి) FAC,
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎల్.ఎం.సి. యూనిట్-1, రాజమండ్రి

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంకు లిమిటెడ్‌తో కలిసినది)
CIN : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హరింగ్‌టన్ రోడ్డు, చెట్‌పెట్, చెన్నై - 600031.
Tel: +91 44 4564 4000 | Fax : +91 44 4564 4022

IDFC FIRST Bank

అనుబంధం IV (రూల్ 8(1))
స్వాధీనత నోటీసు (స్థిరాస్థి కొరకు)

ఎవరైతే దిగువసంతకందారు అయిన ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంకు లిమిటెడ్‌తో కలిసినది) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఆసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క (రూల్ 3) తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ చెల్లింపు/రియలైజేషన్ వరకు డిమాండ్ నోటీసు తేది నుండి నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించేందుకు రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు మరియు హామీదారులను పిలుస్తూ తెలిపిన డిమాండ్ నోటీసును జారీ చేయడం జరిగింది.

రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారులు తిరిగి చెల్లించడంలో విఫలం చెందినందున, రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారు స్వాధీనపరుచుకున్నారు.

లోన్ అకౌంట్ నంబరు	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీత/లు మరియు హామీదారుల పేరు	తనఖా ఆస్తుల వివరణ	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు బకాయి మొత్తం (రూ.)	స్వాధీనం తీసుకున్న తేది మరియు విధానం
140449535	1. కోవూరి ప్రసాద్, 2. కోవూరి జ్యోతి	ఆంధ్రప్రదేశ్-522412, పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజి.జిల్లా, సత్తెనపల్లి ఉపజిల్లా, ముప్పాల మండలం, తొండపి గ్రామ పంచాయతీ, తొండపి గ్రామంలో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.204, డో.నం.3-27, మూల్యాంకనం నం.379, సైట్ విస్తీర్ణం 118 చ.గ.లు. లేదా 99.12 చ.మీ.లు. ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనంలో నిర్మించబడిన 600 చ.అ.లు. సైట్ బయట ఎ.లు. 53.20 సెంట్లు. మరియు హద్దులు : ఉత్తరం : చల్లా సాంబయ్య ఇల్లు-17.8 అ.లు., దక్షిణం : పంచాయతీ రోడ్డు-17.8 అ.లు., పడమర : కొవూరి సాంబయ్య ఇల్లు- 60 అ.లు., తూర్పు : కొవూరి ఆంజనేయులు ఇల్లు- 60 అ.లు.	18.06.2025	Rs. 7,28,346.84/-	10.10.2025 స్వాధీనత
26704672	1. రాచకొండ శ్రీనివాసరావు, 2. రాచకొండ లావణ్య	ఆంధ్రప్రదేశ్-520001, కృష్ణాజిల్లా, విజయవాడ ఎస్.ఆర్.ఓ.పరిధి మరియు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈద్గా మహల్ రోడ్డు, ఆంజనేయ వాగు, కొత్తపేటలో ఉన్న బ్లాక్ నం.21, రెవెన్యూ వార్డు నం.1, మున్సిపల్ వార్డు నం.5ఎ, డో.నం.4-2/4-14, మూల్యాంకనం నం.29471, ఎన్.టి.ఎస్.నం.1734 లో "సమర్థ్ ద్వారకా నిలయం" పేరు మరియు శైలి క్రింద నిర్మించబడిన అపార్టుమెంట్లలోని 2వ అంతస్తులో ఆ ఫ్లాట్ నం.301 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్‌తో ప్లింత్ ఏరియా 743.75 చ.అ.లు., 89.25 చ.అ.లు. సాధారణ ఏరియాతో పాటు, 100.0 చ.అ.లు. కార్ పార్కింగ్‌తో పాటు ఇతర ఉమ్మడి సౌకర్యాలు అనగా.. నీరు, డ్రైనేజీ, మెట్లు, మోటారు మొదలైనవి మరియు అవిభక్త వాటా పరిధి 27.0 చ.గ.లు. లేదా 22.57 చ.మీ.లు. నిర్మించబడిన మొత్తం పరిధి 209.0 చ.గ.లు. లేదా 174.76 చ.మీ.లు.మరియు హద్దులు : పేర్కొన్న ఫ్లాట్ సరిహద్దులు : తూర్పు : మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, లిఫ్ట్, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై. మొత్తం స్థలం సరిహద్దులు : తూర్పు : ఈద్గా మహల్ రోడ్డుగా పిలువబడే మున్సిపల్ రోడ్డు, పడమర : సీరం చిన్నారావు ఆస్తి, ఉత్తరం : దివ్వి వెంకట సుబ్బారావు ఆస్తి, దక్షిణం : మున్సిపల్ లేన్.	25.09.2024	Rs. 19,86,354.05/-	10.10.2025 స్వాధీనత
10068395439	1. మగులూరి ఏలేశ్వరరెడ్డి, 2. మగులూరి సరస్వతి	నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఉపజిల్లా, నరసరావుపేట మున్సిపల్ పరిధిలోని నరసరావుపేట రెవెన్యూ గ్రామం, నరసరావుపేట రెవెన్యూ ఏరియా, బ్యాంక్ కాలనీ ప్రక్కన ఉన్న రెసిడెన్షియల్ ప్లాట్ డో.నం.310 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ కవర్‌చేయబడిన పరిధి ఎ.లు. 63.06 సెంట్లు. మరియు బయట పరిధి 241.68 చ.గ.లు. ఉన్న హద్దులు : ఉత్తరం : అనిశెట్టి కోటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన సైట్ 26 అ.లు., దక్షిణం : 18 అ.లు. వెడల్పు రోడ్డు 26 అ.లు., తూర్పు : కోలోశెట్టి గాంధీ సత్యనారాయణకు చెందిన సైట్ 83.6 అ.లు., పడమర : విక్రేతలకు చెందిన సైట్ 83.6 అ.లు.	20.06.2025	Rs. 38,49,724.70/-	10.10.2025 స్వాధీనత

రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంకు లిమిటెడ్‌తో కలిసినది) కు చెల్లింపు/రియలైజేషన్ వరకు డిమాండ్ నోటీసు తేది నుండి ఇతర వడ్డీ మరియు వ్యయాలు కలుపుకొని డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తాన్ని చెల్లించి జరుపవలెనని పేర్కొనడమైనది.

తేది : 10.10.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంకు లిమిటెడ్‌తో కలిసినది)

షట్‌డౌన్ సమయంలో ఉద్యోగులను తొలగించొద్దు

- ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించిన ఫెడరల్ జడ్జి

శాన్ ఫ్రాన్సిస్కో : ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతున్న సమయంలో ఉద్యోగులను తొలగించేందుకు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఫెడరల్ జడ్జి అడ్డుకున్నారు. షట్‌డౌన్ కొనసాగినంత కాలం ఉద్యోగులను తొలగించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించారు. నాలుగు వేల మంది ప్రభుత్వోద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ఐదు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను నిలిపివేస్తూ న్యాయమూర్తి బుధవారం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం ఉద్యోగుల తొలగింపుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. అంతేకాక తొలగింపులను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన రెండు కార్మిక సంఘాలకు చెందిన సభ్యులకు ఎలాంటి నోటీసులు జారీ చేయకూడదు.

ప్రభుత్వం చేపట్టిన చర్యలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని శాన్ ఫ్రాన్సిస్కో జిల్లా కోర్టు న్యాయమూర్తి సుసాన్ ఒన్నే ఇల్‌స్టన్ స్పష్టం చేశారు. చట్టాలు అమలవుతున్న దేశంలో ఇలాంటి పనులు చేయకూడదంటూ ప్రభుత్వంపై అక్షింతలు వేశారు. 'మనకు చట్టాలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పనులు చట్టానికి లోబడి లేవు' అని వ్యాఖ్యానించారు. షట్‌డౌన్ సమయంలో ఉద్యోగులను ఇంటికి పంపడం అసాధారణ చర్య అని అన్నారు. ప్రతిపక్ష పార్టీని అప్రదిష్టపాలు చేయడానికి ఉద్యోగుల తొలగింపును ఓ మార్గంగా ఎంచుకోవడం ప్రభుత్వం చేయాల్సిన పని కాదని చురక వేశారు. కాగా ఉద్యోగుల తొలగింపును వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేసిన రెండు కార్మిక సంఘాల్లో వేలాది మంది సభ్యులుగా కొనసాగుతున్నారు.

పపువా ప్రావిన్స్‌లో భూకంపం

జకార్తా : ఇండోనేషియాలోని పపువా ప్రావిన్స్‌లో గురువారం భూకంపం సంభవించింది. రెక్టార్ స్కేలుపై దీని తీవ్రత 6.7గా నమోదైంది. అబెపురా నగరానికి 200 కిలోమీటర్ల దూరంలో భూమిలో 70 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం నమోదైందని అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) కార్యాలయం తెలిపింది. భూకంపం సంభవించిన వెంటనే ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఎలాంటి భూ ప్రకంపనలు కూడా నమోదు కాలేదని ఇండోనేషియా వాతావరణ విభాగం తెలిపింది.

అమెరికా ప్రభుత్వ డేటాకు గ్రహణం

- షట్‌డౌన్ కారణంగా అందుబాటులో లేని సమాచారం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థల కలవరపాటు



వాషింగ్టన్/టోక్యో : ప్రభుత్వ షట్‌డౌన్ నేపథ్యంలో అమెరికాలో ఏం జరుగుతోంది? షట్‌డౌన్ తర్వాత ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం అందడం లేదు. దీంతో జపాన్, ఇతర ప్రపంచ దేశాల నేతలు, ప్రజా ప్రతినిధులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికాలో తలెత్తిన షట్‌డౌన్ కారణంగా అనేక కీలక అంశాలకు సంబంధించిన డేటా అందుబాటులో లేకుండా పోతోంది. ఇది చాలా తీవ్రమైన సమస్య అని బ్యాంక్ ఆఫ్ జపాన్ గవర్నర్ కజువో యుడా చెప్పారు. ఆయన చెప్పింది నిజమే. ఎందుకంటే అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ప్రపంచ దేశాల కేంద్ర బ్యాంకులు నిశితంగా పరిశీలిస్తుంటాయి. వాటిని బట్టే తమ వ్యూహాలను, ఎత్తుగడలను నిర్ణయించుకుంటాయి. విధానాలలో మార్పులు చేసుకుంటాయి.

ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) సమావేశాల నిమిత్తం వివిధ దేశాలకు చెందిన ఆర్థిక నిపుణులు, మంత్రులు వాషింగ్టన్‌కు తరలి వచ్చారు. ప్రపంచంలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై సమాలోచనలు జరిపారు. ఇది ఎప్పుడూ జరిగేదే. కానీ ఈసారి అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ తెర పైకి వచ్చింది. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమాచారం హఠాత్తుగా నిలిచిపోవడం వారిని కలవరపరచింది.

షట్‌డౌన్ ఎప్పుడైనా ముగిసిపోవచ్చు. అప్పుడు సమాచార ప్రవాహం తిరిగి ప్రారంభం అవుతుంది. అయితే ఈ ఉదంతం అస్తవ్యస్తంగా అమెరికా పాలన, కనుమరుగవుతున్న డేటా విశ్వసనీయత వంటి అవలక్షణాలను బయటపెడుతోంది. కేంద్ర బ్యాంక్‌పై పెత్తనం సాగించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ అధిపతిని ఆయన పదవి నుంచి తొలగించారు. అమెరికాలో ఉద్యోగాల పరిస్థితిపై ఐఎంఎఫ్ ఇచ్చిన నివేదికపై మండిపడిన ట్రంప్ ఈ చర్యకు పూనుకున్నారు. షట్‌డౌన్ కారణంగా ప్రభుత్వం నుంచి సమాచారం అయితే ఆగిపోయింది కానీ అమెరికా రిజర్వ్‌బ్యాంక్ సర్వేలు, ప్రయివేటు డేటా సర్వీసులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

వెన్ను విరుస్తోంది : బెస్సెంట్

రెండు వారాలుగా అమెరికాలో కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు వారానికి పదిహేను బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా. షట్‌డౌన్ అమెరికా ఆర్థిక వ్యవస్థ వెన్ను విరుస్తోందని ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. కృత్రిమ మేథలో సహా అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి ఇప్పుడిప్పుడే పెట్టుబడులు వస్తున్నాయని, అయితే షట్‌డౌన్ పెద్ద అవరోధంగా నిలిచిందని తెలిపారు.

చైనాలో పెట్టుబడులు పెంచుతాం : ఆపిల్

బీజింగ్ : చైనాలో పెట్టుబడులు పెంచుతామని ఆపిల్ కంపెనీ తెలిపింది. అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఆపిల్ కంపెనీ చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆపిల్ కంపెనీ సీఈఓ టిమ్ కుక్ బుధవారం చైనా పరిశ్రమల మంత్రి లీ లెచంగ్‌తో సమావేశమయ్యారు. ఆ వివరాలను చైనా ప్రభుత్వం విడుదల చేసింది. ఆపిల్ కంపెనీ చైనా మార్కెట్‌లో మరిన్ని ఉత్పత్తులు ప్రవేశపెడుతుందని, చైనా సరఫరాదారులతో కలిసి అభివృద్ధి చెందుతుందని సమావేశం సందర్భంగా లీ లెచంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆపిల్ సహా విదేశీ కంపెనీలకు మంచి వ్యాపార వాతావరణం కల్పిస్తామని చెప్పారు. చైనా పర్యటన సందర్భంగా కుక్ షాంఘైలోని ఆపిల్ స్టోర్‌ను సందర్శించారు. చైనా గేమ్ డెవలపర్లతో సమావేశమయ్యారు.

కాగా ఐఫోన్ల తయారీ సంస్థ ఆపిల్ చైనాలో ఏ మేరకు పెట్టుబడులు పెడుతుందన్న సమాచారం ప్రభుత్వ ప్రకటనలో ఇవ్వలేదు. అమెరికా, చైనా మధ్య నడుస్తున్న వాణిజ్య యుద్ధం ఇప్పటి వరకూ ఈ కంపెనీపై ఎలాంటి ప్రభావం చూపలేదు. ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టవద్దంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశీయ దిగ్గజ కంపెనీలకు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. హువై వంటి చైనా కంపెనీలపై అమెరికా చాలా కాలం క్రితమే ఆంక్షలు విధించింది. ప్రపంచంలో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ అయిన చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తే అధ్యక్ష భవనం ఆగ్రహించి తమ వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీస్తుందేమోనని అనేక దేశీయ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. అందుకే చైనాలో పెట్టుబడులపై అవి ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దేశీయ తయారీ రంగంలో మరో వంద బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతామని ఆగస్టులో ట్రంప్‌కు కుక్ హామీ ఇచ్చారు. దీంతో ఉబ్బితబ్బిబయిన ట్రంప్ ఆయనకు 24 క్యారట్ల బంగారు స్టాండ్‌పై అమర్చిన ఫలకాన్ని బహుకరించారు.

ఆపిల్ సంస్థ చైనాకు చెందిన సరఫరాదారులు, ఫ్యాక్టరీలపై ఆధారపడుతోంది. అది ఉత్పత్తి చేస్తున్న ఐఫోన్లలో చాలా వరకూ చైనాఫ్యాక్టరీలలోనే అసెంబుల్ అవుతున్నాయి. చైనా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడికి ఆపిల్ ఎగుమతులు పెరుగుతున్నాయి.

ఇడి అదుపులో అనిల్ అంబానీ సహాయకుడు

న్యూఢిల్లీ : అనిల్ అంబానీ సహాయకుడు, రిలయన్స్ పవర్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌కుమార్ పాల్‌ను ఇడి అదుపులోకి తీసుకుంది. రూ.63 కోట్ల నకిలీ బాంక్ గ్యారెంటీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై జరుగుతున్న ఆర్థిక దర్యాప్తులో భాగంగా అరెస్ట్ జరిగిందని చెప్పారు. కొన్ని గంటల పాటు సాగిన విచారణ అనంతరం బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్న పాల్‌ను ఢిల్లీలోని ప్రత్యేక పిఎంఎల్ఎ కోర్టు ఎదుట హాజరుపరిచి రెండు రోజుల జ్యూడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఇడి తెలిపింది. అక్టోబర్ 18 వరకు తదుపరి రిమాండ్‌పై కోర్టు తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ఢిల్లీ పోలీసుల దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగాఇడి కేసు దర్యాప్తు చేస్తోంది.

యాంటీబయాటిక్ బాటిల్‌లో పురుగులు

- మధ్యప్రదేశ్‌లో మరో దారుణం

భోపాల్ : దగ్గు సిరప్‌తో చిన్నారుల మృతి ఘటన మరువక ముందే మధ్యప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకుంది. గ్వాలియర్ జిల్లాలోని మోరార్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో యాంటీబయాటిక్ బాటిల్‌లో పురుగులు కనిపించాయి. దీంతో మహిళ ఫిర్యాదు మేరకు యాంటీబయోటిక్ మొత్తం స్టాక్‌ను సీలు చేసి, పరీక్ష కోసం భోపాల్ ప్రయోగశాలకు నమూనాలు పంపినట్లు అధికారులు గురువారం తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక మహిళ అజిత్రోమైసిన్ సిరప్ (ఓరల్ సస్పెన్షన్)లో పురుగులు ఉన్నాయని ఫిర్యాదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఆ మహిళ తీసుకువచ్చిన బాటిల్‌ను పరిశీలించామని అన్నారు. అజిత్రోమైసిన్ ఓరల్ సస్పెన్షన్ సాధారణంగా వివిధ ఇన్ఫెక్షన్లను తగ్గించేందుకు వైద్యులు సూచిస్తారని, ఈ ఔషధాన్ని జనరిక్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక కంపెనీ తయారు చేసిందని అన్నారు. ఆస్పత్రిలో నిల్వ చేసిన 306 బాటిల్స్‌ను వెనక్కి తీసుకున్నామని అన్నారు. కొన్ని ఔషదాల బాటిల్స్‌ను ప్రాథమికంగా తనిఖీ చేసినపుడు పురుగులు కనిపించలేదని, కానీ పరీక్షకు పంపామని అన్నారు. కొన్ని బాటిల్స్‌ను పరీక్ష కోసం భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపామని చెప్పారు. ఔషదం నమూనాను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపుతామని వెల్లడించారు.

మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాకు చెందిన 24 మంది చిన్నారులు కోల్డ్రిఫ్ దగ్గు సిరప్‌తో కిడ్నీ ఫెయిలై మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కోల్డ్రిఫ్, రెస్పిఫ్రెష్ టిఆర్ మరియు రీలైఫ్‌లను నాసిరకం దగ్గు సిరప్‌లు ప్రకటిస్తూ నిషేధం విధించింది.

సిజెఐపై దాడి
న్యాయవాదిపై కోర్టు ధిక్కార కేసుకు అనుమతి

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాదిపై కోర్టు ధిక్కార కేసుకు అటార్నీ జనరల్ అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని సంబధిత అధికారులు గురువారం తెలిపారు. దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కోర్టు ధిక్కార కేసును విచారించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ)చీఫ్, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చిలతోకూడిన ధర్మాసనాన్ని కోరారు. అక్టోబర్ 6న జరిగిన ఈ ఘటనపై సోషల్‌మీడియా తీవ్రంగా వ్యవహరిస్తోందని, న్యాయవ్యవస్థ సమగ్రత, గౌరవాన్ని కించపరుస్తోందని న్యాయవాది వికాస్‌సింగ్ పేర్కొన్నారు. కించపరిచే వ్యాఖ్యలను అడ్డుకునేలా సోషల్‌మీడియాపై నిషేధాజ్ఞలు జారీ చేయాలని మెహతా, సింగ్‌లు కోర్టును కోరారు.

ప్రాథమిక హక్కు అయిన భావవ్యక్తీకరణ, స్వేచ్ఛ సంపూర్ణమైనది కాదని, ఇతరుల సమగ్రత, గౌరవానికి భంగం కలిగించకూడదని ధర్మాసనం మండిపడింది. అయితే ఈ ధిక్కార కేసును అత్యవసరంగా జాబితా చేసేందుకు ధర్మాసనం నిరాకరించింది. వారం రోజుల తర్వాత అత్యవసర కేసుల జాబితా అనంతరం పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. అక్టోబర్ 6న సుప్రీంకోర్టు విచారణ సమయంలో సిజెఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే.

నిమిష ప్రియకు ఉరిశిక్ష కేసు జనవరికి వాయిదా

న్యూఢిల్లీ : యెమెన్‌లో హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియ కేసు విచారణను సుప్రీంకోర్టు వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేసింది. అత్యవసరమైతే ముందస్తు జాబితా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. 2017లో తన యెమెన్ వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన నర్సును రక్షించడానికి దౌత్య మార్గాలను వినియోగించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ కొనసాగించింది. నిమిష ప్రియ ఉరిశిక్షపై స్టే కొనసాగుతోందని, ఎటువంటి ప్రతికూల ఘటనలు చోటు చేసుకోలేదని కేంద్రం కోర్టుకు తెలిపింది. నిమిష ప్రియ ఉరిశిక్ష అంశంపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం అడిగిన ప్రశ్నకు.. అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి పైవిధంగా సమాధానమిచ్చారు. ఈ విషయంలో కొత్త మధ్యవర్తి జోక్యం చేసుకున్నారని, మంచి విషయం ఏమిటంటే ప్రతికూలంగా ఏమీ జరగడం లేదని తెలిపారు.

వి.ఎస్ అచ్యుతానందన్ సోదరి అజికుట్టీ కన్నుమూత



అజికుట్టీ (ఫైల్)

అలప్పుజా : కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధ వి.ఎస్ అచ్యుతానందన్ సోదరి అజికుట్టీ (95) గురువారం తుదిశ్వాస విడిచారు. కొన్ని నెలలుగా వయో సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె గురువారం తెల్లవారుజామున అలప్పుజా సమీపంలోని పరవూర్‌లోని నివాసంలో కన్నుమూశారు. అచ్యుతానందన్‌కు ఇద్దరు సోదరులు గంగాధరన్, పురుషన్‌లు కాగా, వీరికి అజ్జికుట్టీ ఏకైక సోదరి. సోదరులు ఇప్పటికే మరణించారు. అచ్యుతానందన్ ఈ ఏడాది జులైలో మరణించిన సంగతి తెలిసిందే. ప్రతీ ఏటా ఓనంతో సహా వివిధ సందర్భాల్లో సోదరి ఇంటిని ఆయన సందర్శించేవారు. అఖరిసారిగా 2019లో వచ్చారు.

హామీలు నిలబెట్టుకోవడంలో మోడీ సర్కార్ విఫలం

- ఒమర్ అబ్దుల్లా

జమ్మూ : ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వ బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన ఒక సభలో ఒమర్ అబ్దుల్లా ప్రసంగించారు. జమ్ముకాశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారని ఆశించామని, కానీ ఇప్పటికీ మోడీ సర్కార్ మాట నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. జమ్ముకాశ్మీర్‌కు, లఢఖ్‌కు ఇచ్చిన హామీలను కేంద్రం వమ్ము చేసిందన్నారు. ఇప్పటికైనా జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎయిర్ ఇండియా ప్రమాదంపై ఎఎఐబి విచారణ లోపభూయిష్టం

- పారదర్శక న్యాయ విచారణకు సుప్రీంకోర్టులో పైలట్ తండ్రి పిటిషన్

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) చేపట్టిన విచారణ అంతా తప్పుల తడక అని, లోపభూయిష్టమని ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరరాజ్ సభర్వాల్ అన్నారు. ఇప్పటికైనా పారదర్శకమైన, నిష్పక్షపాత న్యాయ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. భారత పైలట్ల సంఘంతో కలిసి గురువారం నాడు సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఎఎఐబి విచారణ పైలట్ల ప్రతిష్టను దెబ్బతీసేవిధంగానూ, లోపభూయిష్టంగానూ, పక్షపాతంగానూ ఉందని 91 ఏళ్ల పుష్కరరాజ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే తన కుమారుడు సుమీత్ 30 ఏళ్లకు పైగా మచ్చలేని కెరీర్‌ను కలిగి ఉన్నాడని, 15,638 గంటల పాటు విమాన ప్రయాణాన్ని ఒక్క లోపం కూడా లేకుండా నిర్వర్తించాడని పిటిషన్‌లో గుర్తు చేశారు. ఈ పిటిషన్ దీపావళి సెలవుల తరువాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 260 మంది మరణించిన సంగతి తెలిసిందే. మృతుల్లో పైలట్ సుమీత్ సభర్వాల్‌తో సహా 12 మంది సిబ్బంది ఉన్నారు.

ట్రంప్ అంటే మోడీకి భయం : రాహుల్ ఎద్దేవా

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను చూసి ప్రధాని నరేంద్ర మోడీ భయపడ్డారని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేయబోమని మోడీ తనకు హామీ ఇచ్చారంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన స్పందించారు. ఎన్ని అవమానాలు ఎదురవుతున్నప్పటికీ ట్రంప్ కు మోడీ అభినందన సందేశాలు పంపుతూనే ఉన్నారని ఎత్తిపొడిచారు. 'ట్రంప్‌ను చూసి మోడీ భయపడ్డారు. రష్యా నుంచి భారత ప్రభుత్వం చమురును కొనుగోలు చేయబోదని ట్రంప్ ప్రకటించారు. అలా ప్రకటించేందుకు మోడీ ఆయన్ని అనుమతించారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ట్రంప్ వాదనతో విభేదించలేదు. వీటన్నింటినీ చూస్తుంటే ఆయన ట్రంప్‌ను చూసి భయపడుతున్నట్లే కన్పిస్తోంది' అని అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో లైంగిక అకృత్యాలు

- అసహజరీతిలో వేధింపులు
- 26 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యతో వెలుగులోకి
- ఇన్‌స్టాగ్రామ్‌లో సూసైడ్ నోట్, వీడియో పోస్టు



అనంతు సాజి (26)

ఇండియన్ న్యూస్ నెట్‌వర్క్ - తిరువనంతపురం

మతతత్వ జాడ్యంతో ప్రజల మధ్య చిచ్చురాజేసే సంస్థగా పేరున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఇటీవలే వందేళ్ల పూర్తి చేసుకుంది. ఇదే సందర్భంలో కేరళలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం చేసుకోవడం, ఆయన రాసిన సూసైడ్ నోట్.. ఆర్‌ఎస్‌ఎస్ వికృత రూపాన్ని మరోమారు వెలుగులోకి తీసుకొచ్చింది. కేరళలోని కొట్టాయం జిల్లాలో ఎలిక్కులం పంచాయితీలోని వంచిమలకు చెందిన బాధిత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనంతు సాజి (26) ఈ నెల 9న తిరువనంతపురం సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని హోటల్ రూమ్‌లో ఆత్మహత్మకు పాల్పడ్డారు. సూసైడ్‌నోట్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు ఎన్‌ఎం (స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు నిధీష్ మురళీధరన్‌గా గుర్తించారు) తనను నాలుగు, ఐదేళ్ల వయస్సు నుంచే భౌతికంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన వివిధ క్యాంపుల్లో ఈ దారుణాలను కొనసాగించినట్లు వెల్లడించారు. ఎన్‌ఎం, ఆర్‌ఎస్‌ఎస్‌తో తన ప్రశాంతతకే ముప్పు ఏర్పడిందని పేర్కొన్నారు. 'ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో నేతలందరూ వేధింపుదారులే. అక్కడ అసహజమైన లైంగిక వేధింపులు సర్వసాధారణం. ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించే ఐటిసి, ఒటిసి క్యాంపుల్లో నేను ఎదుర్కొన్న దారుణాలు అన్నీఇన్నీ కావు. దయచేసి ఆర్‌ఎస్‌ఎస్‌తోనూ, దానితో సంబంధమున్న వారితోనూ ఎప్పుడూ స్నేహం చేయవద్దు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక విషపూరిత సంస్థ. ఆర్‌ఎస్‌ఎస్ అనేది వేధింపుదారుల సంస్థ. దానికి దూరంగా ఉండండి' అని అనంతు ఆ నోట్‌లో పేర్కొన్నారు. తాను బలవన్మరణం చేసుకోవడానికి ముందుగా ఆయన తన ఆత్మహత్యకు దారితీసిన ఆర్‌ఎస్‌ఎస్ అకృత్యాలను తెలియజేస్తూ ఒక వీడియో చిత్రీకరించి, దానితో పాటు ఒక రాతపూర్వక నోట్ రాసి వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో తనపై వేధింపులు కారణంగా మానసిక ఒత్తిడికి గురయ్యానని, అసహజ లైంగిక వేధింపులను ఎవ్వరికీ చెప్పుకోలేక..మరో మార్గం లేకపోవడంతోనే ఆత్మహత్య చేసుకోవాల్సివస్తోందని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ క్యాంపుల్లో వేధింపులు ఎక్కువగా జరుగుతాయని కూడా ఈ వీడియోలో అనంతు తెలిపారు. క్యాంపుల్లో లైంగిక, శారీరక వేధింపులు సర్వసాధారణమని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో వేధింపులు ఎదుర్కొన్నవారు అనేక మంది ఉన్నారని, ఆర్‌ఎస్‌ఎస్ నేతల బెదిరింపులు కారణంగా ఎవ్వరూ పెదవి విప్పలేకపోతున్నారని, ఆధారాలు కూడా ఉండవని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వారితో దూరంగా ఉండాలని, ఆ సంస్థలో భాగం కాకూడదని కూడా ఆయన హెచ్చరించారు. ఈ వీడియో ఆధారంగా తంపనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వీడియోను సెప్టెంబరు 8న రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. ఒత్తిడి, నిరాశ కారణంగా అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఒసిడి)కు గురయ్యాయని, దీనికి మందులు వాడుతున్నట్లు కూడా తెలిపారు. ఈ ఘటనపై డివైఎఫ్ఐ కూడా రాతపూర్వక ఫిర్యాదులు చేసింది. విచారణకు పిలుపునిచ్చింది. ఈ ఘటన 'ఆర్‌ఎస్‌ఎస్ వికృత రూపాన్ని' బయటపెట్టిందని విమర్శించింది.

పాఠశాలలు, కాలేజీల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలపై నిషేధం

బెంగళూరు : ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతతత్వ సంస్థలు ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ నియంత్రణలోని ఇతర సంస్థల్లోకి ప్రవేశించకుండా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కర్ణాటక మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర న్యాయ, శాసనసభా వ్యవహారాల మంత్రి హెచ్‌కె పాటిల్ గురువారం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఆర్‌ఎస్‌ఎస్ సాగించే కార్యకలాపాలపై నిషేధం విధించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరుతూ ఐటి-బిటి మంత్రి ప్రియాంక ఖర్గే లేఖ రాసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్తులైన కాలేజీలు, పాఠశాలలు, సంస్థల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను ఎంత మాత్రమూ అనుమతించరాదని ఖర్గే ఈ నెల 12న ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో అక్కడి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌పై తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీని సిద్ధరామయ్య ఆదేశించారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు

ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు హాజరయ్యే ప్రభుత్వ అధికారులను సస్పెండ్ చేస్తామని మంత్రి ప్రియాంక ఖర్గే హెచ్చరించారు. తన విభాగంలో కొంతమంది ఉద్యోగులు ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలకు సంస్థ యూనిఫారంలో వెళ్ళారని, త్వరలో వారిని సస్పెండ్ చేస్తామని విలేకర్లకు తెలిపారు. ఇందుకు సంబంధించి పలువురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థల కార్యకలపాలకు ప్రభుత్వ ఉద్యోగులు హాజరవుతున్నారని అన్నారు.

విద్య, వాణిజ్య రంగాల్లో సహకారం

- శ్రీలంక ప్రధాని హరిణితో జై శంకర్ భేటీ



న్యూఢిల్లీ : విద్యా, వాణిజ్య రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడం కోసం చేపట్టాల్సిన చర్యలపై విదేశాంగ మంత్రి జై శంకర్, శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య చర్చలు జరిపారు. శ్రీలంకకు భారత్ మద్దతు ఎల్లప్పుడూ వుంటుందని ఈ సందర్భంగా జైశంకర్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం భారత్‌లో రెండు రోజుల పాటు పర్యటిస్తున్న హరిణి.. గురువారం ఉదయం జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించడంపై కూడా వారు చర్చించారు. ఈ మేరకు జై శంకర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పొరుగు దేశాలకు ప్రాధాన్యతనిచ్చే భారత్ విధానంలో భాగంగా, అలాగే భారత్ అనుసరించే 'మహాసాగర్ దార్శనికత'లో భాగంగా ఇరు దేశాల మధ్య స్నేహ బంధాన్ని ఈ పర్యటన బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమరసూర్య తొలి విదేశీ పర్యటన ఇదే. ఈ రెండు రోజుల్లో పలువురు నేతలతో ఆమె భేటీ కానున్నారు. పలు రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై చర్చలు జరపనున్నారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా చూస్తున్న అమరసూర్య ఇక్కడ ఢిల్లీ ఐఐటిని, నీతి అయోగ్‌ను సందర్శిస్తారు. విద్య, వినూత్న సాంకేతిక రంగాల్లో సహకారంపై చర్చలు జరపుతారు. అనంతరం ఆమె ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల పటిష్టతకు ఉద్దేశించిన ఒక వాణిజ్య కార్యక్రమానికి కూడా హాజరవుతారు.

పునర్నిర్మాణం అంత ఈజీ కాదు

- గాజాలో ఎక్కడ చూసినా విధ్వంసమే
- కుప్పలు కుప్పలుగా పడి ఉన్న శిథిలాలు
- ఇజ్రాయిల్ మారణహోమం మూల్యం 70 బిలియన్ డాలర్లు



ఇజ్రాయిల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత గాజా సిటీలో ప్రస్తుత పరిస్థితి

గాజా : ఇజ్రాయిల్ మారణహోమం కారణంగా చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురై ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్న వేలాది మంది గాజా వాసులు కాల్పుల విరమణ తర్వాత తిరిగి స్వస్థలాలకు చేరుకుంటున్నారు. కానీ అక్కడి దృశ్యాలు వారిని కలచివేస్తున్నాయి. జనావాసాలన్నీ ఇజ్రాయిల్ దాడిలో ఎప్పుడో నేలమట్టమయ్యాయి. ఇప్పుడక్కడ శిథిలాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. సర్వం కోల్పోయిన బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం, వ్యాపారాలను తిరిగి ప్రారంభించడం, మూతపడిన సంస్థలను తెరవడం, జనజీవనాన్ని గాడిలో పెట్టడం...ఈ పనులు అంత తేలికగా పూర్తయ్యేవి కావు. గాజాలో ఇజ్రాయిల్ సాగించిన విధ్వంసం కారణంగా 70 బిలియన డాలర్ల నష్టం జరిగిందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది.

శిథిలాల కుప్పలు

గాజా ప్రాంతంలో 84 శాతం మేర విధ్వంసం జరిగిందని పాలస్తీనియన్ల కోసం ఐరాస చేపట్టిన అభివృద్ధి కార్యక్రమానికి ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరిస్తున్న జాకో సిల్లియర్స్ చెప్పారు. గాజా సిటీ వంటి కొన్ని ప్రాంతాల్లో దీని స్థాయి 92 శాతం వరకూ ఉంది. ఇప్పుడు అక్కడ ఎక్కడ చూసినా శిథిలాలే కన్పిస్తున్నాయి. గాజాలో 60 మిలియన్ టన్నుల శిథిలాలు పేరుకుపోయాయని ఓ అంచనా. పునర్నిర్మాణ పనులు చేపట్టాలంటే ముందుగా యుద్ధం మిగిల్చిన శిథిలాల కుప్పలను తొలగించాల్సి ఉంటుంది. దారుణమేమంటే ఈ శిథిలాలలో ఆవాసాల అవశేషాలే కాదు...మానవ కళేబరాలు, పేలని బాంబులు కూడా ఉన్నాయి. ముందుగా వాటిని జాగ్రత్తగా తొలగించి ధ్వంసం చేయాల్సిన అవసరం ఉంది. తొలగించిన భవన శిథిలాలను నిర్మాణాలకు పునాదులుగా ఉపయోగించుకోవచ్చు. కానీ ఆవాసాల నిర్మాణానికి పెద్ద ఎత్తున సామగ్రిని దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.

మౌలిక వసతులపై దృష్టి

శిథిలాల తొలగింపు భగీరథ ప్రయత్నమే. ఆ పని పూర్తయిన తర్వాత నీరు, పారిశుధ్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టాల్సి ఉంటుంది. గాజా ప్రజలకు తక్షణమే సురక్షితమైన తాగునీరు అందించాలి. 2023 సెప్టెంబర్ 7వ తేదీ తర్వాత ఈ ప్రాంతంలోని 600 నీరు, పారిశుధ్య సౌకర్యాలు ధ్వంసమవడమో లేదా దెబ్బతినడమో జరిగింది. మురుగునీటి యాజమాన్యం కూడా చాలా ముఖ్యమైనదే. అది సరిగా లేకుంటే వ్యాధులు ప్రబలుతాయి. గాజాలో డయేరియా వ్యాధి ఎక్కువగా ఉంది. ఇది చిన్నారుల ప్రాణాలను హరిస్తుంది. కొన్ని చోట్ల కలరా ముప్పు కూడా పొంచి ఉంది. గాజాలో ఆరు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఉండగా అవన్నీ ఇజ్రాయిల్ దాడిలో పూర్తిగా ధ్వంసమయ్యాయి. రక్షిత మంచినీరు అందించే ప్లాంట్లు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పుడు పనులు ఎక్కడి నుంచి మొదలు పెట్టాలో అర్థం కావడం లేదని సహాయ సిబ్బంది అంటున్నారు.

దశాబ్దాలు పట్టొచ్చు

ఇక ఇజ్రాయిల్ దాడిలో నేలమట్టమైన ఆవాసాలకు లెక్కే లేదు. గాజాలో 2,82,904 ఇళ్లు, అపార్ట్‌మెంట్లు దెబ్బతినడమో లేదా ధ్వంసం కావడమో జరిగిందని ఐరాస ఉపగ్రహ కేంద్రం తెలిపింది. అయితే ఇంతకంటే ఎక్కువ విధ్వంసమే జరిగిందని చెబుతున్నారు. గాజా నగరంలో హమాస్ పాలనలో ఉన్న ఓ మున్సిపాలిటీలో 90 శాతం రహదారులు పనికి రాకుండా పోయాయి. గాజాలో జనావాసాల నిర్మాణానికి దశాబ్దాల సమయం పట్టవచ్చు. గాజాలో విద్యుత్ పరిస్థితి అయితే మరింత ఘోరంగా ఉంది. యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అక్కడ సంక్షోభం నెలకొంది. గాజాలో ప్రతి రోజూ కొద్ది గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరిగేది. ఇజ్రాయిల్ నుంచి సరఫరాలు ఆగిపోయాయి. ఇంధన కొరత కారణంగా గాజా పవర్ ప్లాంటు మూతపడింది. సౌర విద్యుత్ సౌకర్యాలు దెబ్బతిన్నాయి. గ్రిడ్ పనిచేయకపోవడంతో డీజిల్ జనరేటర్లు, సోలార్ ప్యానల్స్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 80 శాతానికి పైగా విద్యుదుత్పత్తి, పంపిణీ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి.

దెబ్బతిన్న పంటలు...మూతపడ్డ బడులు

యుద్ధంతో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైపోయింది. గాజా స్ట్రిప్‌లో 82.4 శాతం వార్షిక పంటలు, 97 శాతానికి పైగా చెట్ల పంటలకు నష్టం వాటిల్లింది. మానవతా సాయంపై దీర్ఘకాల ఆంక్షలతో ఆహార భద్రత కరువైంది. గాజా నగరాన్ని సెప్టెంబరులో కరువు ప్రాంతంగా ప్రకటించారు. యుద్ధానికి ముందు గాజా జనాభాలో దాదాపు సగం మంది 18 సంవత్సరాల లోపు వయసున్న వారే. కాబట్టి జనజీవనం తిరిగి సాధారణ స్థాయికి చేరుకోవాలంటే వెంటనే పాఠశాలల నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. యుద్ధ సమయంలో నిర్వాసితులకు పాఠశాలల్లోనే పునరావాసం కల్పించారు. దీంతో ఇజ్రాయిల్ దళాలు వాటిని లక్ష్యంగా చేసుకొని బాంబు దాడులు జరిపాయి. ఇప్పుడు 91.8 శాతం పాఠశాల భవనాలను పూర్తిగా పునర్నిర్మించడమో లేక వాటికి భారీగా మరమ్మతులు చేయడమో జరగాల్సి ఉంది.

వెనిజులాలో వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

- రహస్య కార్యకలాపాల కోసం సిఐఎకి ట్రంప్ అనుమతి

వాషింగ్టన్ : వెనిజులాలోని వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చాడానికి అమెరికా అధ్యక్షులు ట్రంప్ కుట్ర పన్నారు. ఇందుకోసం రహస్య కార్యకలాపాలు నిర్వహించడానికి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (సిఐఎ)కు ట్రంప్ అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తెలిపారు. బుధవారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ వెనిజుల నుంచి నేరస్తులను అమెరికాలోకి పంపిస్తున్నారని, మాదక ద్రవ్యాలను సముద్ర మార్గం ద్వారా అక్రమ రవాణా చేసి అమెరికాను అస్థిరపరిచే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అందుకే సిఐఎకి అనుమతి ఇచ్చానని చెప్పుకొచ్చారు. అయితే వెనిజులాపై ఆరోపణలకు సంబంధించిన అధారాలను మాత్రం వెల్లడించలేదు. వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా ప్రయత్నాలను వేగవంతం చేసింది. కరేబియన్ సముద్ర జలాల్లో యుద్ధ నౌకలను, విమానాలను, అణు జలాంతర్గాములను,10 వేల సైన్యాన్ని మోహరించింది. అమెరికా సైన్యం తమ ఓడలపై దాడి చేసిన ఇప్పటివరకు 29 మంది అమాయక మత్స్యకారులను హత్య చేసిందని వెనిజులా అధికారులు వెల్లడించారు. దీనిపై అమెరికాలోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇతర దేశాలపై అమెరికా సైన్యం దాడి చేయాలంటే కాంగ్రెస్ అనుమతి తప్పనిసరని, సైనిక చర్య జరిపిన 48 గంటల్లో అధ్యక్షుడు కాంగ్రెస్‌కు తెలియజేయాలి. కాని ట్రంప్ రాజ్యాంగ విరుద్దంగా కరేబియన్ సముద్ర జలాల్లో దాడులు జరిపారని ప్రముఖ రాజ్యాంగ న్యాయవాది బ్రూస్ ఫిన్ విమర్శించారు..

సిఐఎ రక్త చరిత్ర..

అమెరికా గూఢచార సంస్థ సిఐఎకు అనేక దేశాల్లో ప్రజాస్వామ్యంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోయడంలో సుదీర్ఘ చరిత్ర ఉంది. 1953-54లో ఇరాన్, గ్యాటిమాలా దేశాల్లో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలను పడగొట్టింది.1973లో చిలిలో తిరుగుబాటు రేపి వేలాదిమందిని ఊచకోత కోసింది. అధ్యక్షుడు అలెండి మరణాంతరం అమెరికా తోత్తు జరలర్ పినోచెట్ నేతృత్వంలో ప్రభుత్వాన్ని నెలకొల్పింది. 1989లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతోనే పనామా దేశంపై సిఐఎను ఉపయోగించి దాడి చేసారు. క్యూబా నేత ఫెడల్ క్యాస్ట్రోను హత్య చేయడానికి దాదాపు 600 సార్లు ప్రయత్నించి విఫలమైంది. అమెరికా డబ్ల్యూటిఎపై ఉగ్రవాదుల దాడి అనంతరం సిఐఎ అక్రమాలకు హద్దేలేకుండా పోయింది. అటువంటి రక్త చరిత్ర కలిగిన సిఐఎను వెనిజులాపై ప్రయోగిచడానికి ట్రంప్ సిద్దమయ్యారు. ట్రంప్ ప్రకటనను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘిస్తుందని, వెనిజులాలో ఉన్న అపారమైన చమురు నిక్షేపాలపై అమెరికా కన్ను పడిందని విమర్శించారు. కానీ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటామన్నారు. వామపక్ష ప్రభుత్వం ప్రజల హక్కులను పరిరక్షించడానికి ఎంతటి త్యాగానికైనా సిద్దపడుతుందని తెలిపారు.అమెరికాపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రెండు దేశాల ఏర్పాటే పరిష్కారం

- పాలస్తీనా సమస్యపై 'నామ్'లో భారత్

కంపాలా (ఉగాండా) : పాలస్తీనా సమస్యకు రెండు దేశాల ఏర్పాటే ఏకైక పరిష్కారమని భారత్ స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలో శాశ్వతంగా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలంటే ఇదొక్కటే సరైన మార్గమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది. ఉగాండా రాజధాని కంపాలాలో బుధవారం పాలస్తీనాపై నామ్ మంత్రివర్గ కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ మాట్లాడుతూ, స్వీయ నిర్ణయాలు తీసుకునేందుకు పాలస్తీనియన్లకు గల తిరుగులేని హక్కుకు, వారి జాతీయ స్వేచ్ఛ, సార్వభౌమాధికారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతునిస్తుందని స్పష్టం చేశారు. శాంతి నెలకొనడానికి గల ప్రామాణికాలను కూడా ఆయన స్పష్టం చేశారు. భద్రమైన, గుర్తించిన సరిహద్దుల పరిధిలో సార్వభౌమాధికారంతో కూడిన స్వతంత్ర, సుస్థిర పాలస్తీనా దేశం పక్కనే ఇజ్రాయిల్‌తో కలిసి శాంతి భద్రతలతో జీవించాలని భారత్ కోరుకుంటోందని చెప్పారు. గాజాలో గత రెండేళ్ళుగా ఇజ్రాయిల్ మారణహోమం సాగిస్తున్నా తమ వైఖరి మారలేదని చెప్పారు. తీవ్రవాదాన్ని ఖండిస్తున్నామన్నారు. గాజాలో విధ్వంసకాండకు అంతం పలకాలని, పౌరుల కష్టాలు ఇక తీరాలని అన్నారు. పాలస్తీనాతో భారత్‌కు గల చారిత్రక సంబంధాలను గుర్తు చేసుకున్నారు.



గోదావరి పర్లేకర్ వర్ధంతి సందర్భంగా వాడాలో నిర్వహించిన సభకు తరలి వచ్చిన ప్రజలు

ఆదివాసీ అమర వీరులకు సిపిఎం నివాళి

థానే : మహారాష్ట్రలోని థానే-పాల్ఘర్ జిల్లాలో అమరవీరుల దినోత్సవాన్ని, కామ్రేడ్ గోదావరి పర్లేకర్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లాలో అరుణ పతాకం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన 61 మంది అమరవీరుల స్మృత్యర్థం సిపిఎం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ అమరవీరుల్లో చాలా మంది గిరిజనులే. వీరిలో ఐదుగురు వర్లి ఆదివాసి తిరుగుబాటులో మరణించారు. 1945లో బ్రిటీష్ హయాంలో పోలీసులు వారిని కాల్చివేశారు. ఈ సందర్భంగా ఈ ఏడాది వాడాలో నిర్వహించిన బహిరంగ సభకు దాదాపు 25 వేల మంది హాజరయ్యారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు డాక్టర్ అశోక్ ధావలె, మరియం ధావలె, కేంద్ర కమిటీ సభ్యులు, సిపిఎం మహారాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజిత్ నవలె, కేంద్ర కమిటీ సభ్యులు, ఎంఎల్‌ఎ వినోద్ నికొలె పలువురు రాష్ట్ర నేతలు బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రముఖ ఆదివాసీ నేత కామ్రేడ్ బర్క్యా మంగత్ పేరిట వాడాలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

దేశంలో తగ్గిన ఏనుగులు

- తాజా సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా అడవి ఏనుగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కేంద్ర ప్రభుత్వ అటవీ,పర్యావరణ శాఖ విడుదల చేసిన తాజా సర్వే నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా 22,446 ఏనుగులు మాత్రమే ఉన్నట్లు వెల్లడైంది. 2017 గణాంకాలతో పోలిస్తే 18శాతం తక్కువగా నమోదు కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా ఆమోదించిన 'డిఎన్‌ఎ ఆధారిత' పద్దతిలో తాజా సర్వే ను నిర్వహించారు. మన దేశంలో ఈ పద్దతిలో సర్వే నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈ నేపథ్యంలో ఇకనుండి భవిష్యత్ గణాంకాలకు ఈ ఏడాది (2025 సంవత్సరపు) సర్వేనే బేస్‌గా తీసుకోవాలని నిర్ణయించారు. తాజా సర్వే ప్రకారం పశ్చిమ కనుమలు ప్రాంతంలో అత్యధికంగా 11,934 ఏనుగులు ఉండగా, ఈశాన్య బ్రహ్మపుత్ర దట్టమైన అటవీ ప్రాంతాల్లో 6,559 ఏనుగులు ఉన్నట్టు లెక్కించారు. శివాలిక్, గంగా సమతలాలు 2,062ఏనుగులు, మధ్య భారతదేశం, తూర్పు కనుమల్లో కలిపి 1,891 ఏనుగులు ఉన్నట్లు తేలింది. రాష్ట్రాల వారీగా చూస్తే ఒక్క తమిళనాడు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ ఏనుగుల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. కర్నాటకలో అత్యధికంగా 6013 ఏనుగులు ఉన్నట్లు తాజా సర్వేలో తేలింది. ఈ రాష్ట్రంలో 2017లో 6049 ఉన్నాయి. అస్సాంలో 2017లో 5719 ఉండగా తాజా సర్వేలో 4159, తమిళనాడులో 2017లో 2761 ఏనుగులు ఉండగా, ప్రస్తుతం 3136 ఉన్నట్లు తేలింది. కేరళలో 2017లో 3054 ఏనుగులు ఉండగా ప్రస్తుతం 2785 ఉన్నాయి. మన రాష్ట్రంలో 2017లో150 నుండి 200 వరకు ఉంటాయని అంచనా వేయగా ప్రస్తుతం వాటి సంఖ్య 120కి తగ్గింది. అడవుల నరికివేత, గనుల విస్తరణ,మనుష్యులు-ఏనుగుల మధ్య ఘర్షణలు పెరగడం ఏనుగుల సంఖ్య తగ్గడానికి కారణంగాభావిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఆశన్న సహా 170 మంది మావోయిస్టులు లొంగుబాటు



ఆశన్న

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు అగ్ర నేత ఆశన్న సహా 170 మంది లొంగిపోయినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రెండు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయినట్టు తెలిపారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. రెండ్రోజుల్లో మొత్తంగా 258మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు. వీరంతా హింసా మార్గం వీడి రాజ్యాంగంపై విశ్వాసం చూపటాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆయుధాలతో పోరాడేవారికి భద్రతాదళాలే తగిన సమాధానం చెబుతాయన్నారు. జనజీవన స్రవంతిలో కలవాలని తుపాకీతో పోరాటం చేస్తున్న వారికి మరోసారి పిలుపునిస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టుల్ని తుదముట్టించటానికి కేంద్రం కట్టుబడి ఉన్నట్టు అమిత్ షా తేల్చి చెప్పారు. ములుగు జిల్లా పోలోనిపల్లికి చెందిన ఆశన్న ఐటిఐ, పాలిటెక్నిక్ చదివారు. 1991లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన ఆయన, 1999లో పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సారథిగా పగ్గాలు చేపట్టారు. అదే ఏడాది హైదరాబాద్‌లో ఐపిఎస్ అధికారి ఉమేశ్ చంద్రను పట్టపగలే నడిరోడ్డుపై హత్య చేసిన ఆపరేషన్‌కు ఆయనే నేతృత్వం వహించినట్టు ప్రచారంలో ఉంది. 2000లో ఉమ్మడి ఎపి హోంమంత్రి ఎ.మాధవరెడ్డి ప్రయాణిస్తున్న కారును మందుపాతర తో పేల్చేసి చంపేయడం, 2003లో అలిపిరిలో నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్‌ను క్లైమోర్‌మైన్‌తో పేల్చి ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిన దుశ్చర్యలతో ఆశన్న పేరు విస్తృతంగా ప్రచారమైంది.

బీహార్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

- 15 మందికి పైగా పేర్లతో తొలి జాబితా
- నామినేషన్ల స్వీకరణకు రేపే చివరి తేదీ

న్యూఢిల్లీ : బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకంపై విపక్ష మహాగఠ్‌బంధన్(ఇండియా బ్లాక్)లో ఇప్పటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ 15 మందికి పైగా పేర్లతో తొలి జాబితాను విడుదల చేసింది. తొలి దశ పోలింగ్ నామినేషన్ల స్వీకరణకు రేపే చివరి తేదీ. అయినప్పటికీ మహాగఠ్‌బంధన్‌లో సీట్ల పంపకం కొలిక్కి రాకపోవటం, కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించటం ఆసక్తికరంగా మారింది. తమ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపే ప్రకటనను కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్ ద్వారా వెల్లడించింది. గోపాల్ గంజ్, అమర్‌పూర్, బెగుసరాయ్, సుల్తాన్‌గంజ్, కుటుంబ, వసీర్‌గంజ్, నలంద, ఔరంగబాద్, రాజాపకడ్, బచ్వర్, బారాబిగా, ముజఫర్‌పూర్, గోవింద్‌గంజ్, రోసెరా, లఖిసరాయ్, బికర్మ్ వంటి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్టుగా తెలుస్తున్నది.

లాలూకు రాహుల్ ఫోన్

మహాగఠ్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మొత్తం 60 స్థానాలో కోసం పట్టుబడుతున్నది. కానీ ఆర్జేడీ 50 సీట్లను మాత్రమే ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నది. తాను గెలిచే స్థానాలను విడిచిపెట్టుకోవటానికి ఆర్జేడీ ఏ మాత్రమూ సిద్ధంగా కనబడటం లేదు. ఈ నేపథ్యంలో సీట్ల పంపకంలో ఏకాభిప్రాయం సాధించేందుకు కాంగ్రెస్, ఆర్జేడీ అగ్రనేతల మధ్య చర్చలు నడుస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు ఆర్జేడీ అగ్రనేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడరని పార్టీ వర్గాలు తెలిపాయి. సీట్ల పంపకంలో ఒక ఒప్పందాన్ని ఖరారు చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

రూ.37 కోట్ల విలువైన మద్యం, నగదు స్వాధీనం

పాట్నా : బీహార్‌లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత రూ.37 కోట్లకుకు పైగా విలువైన నగదు, మద్యం, నార్కొటిక్స్, ఇతర విలువైన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఒక్క రోజు రూ.1.284 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు. దీంతో బుధవారం నాటికి సీజ్ చేసిన వీటి విలువ మొత్తం రూ.37.14 కోట్లకు చేరిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. నగదు, మద్యంతో పాటు 221 అక్రమ ఆయుధాలను సీజ్ చేసినట్టు వివరించారు. 1487 కాట్రిడ్జ్‌లు, ఐదు పేలుడు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఆయుధాలు తయారు చేస్తున్న మొత్తం 14 కేంద్రాలపై ఇప్పటి వరకు దాడులు నిర్వహించారు. రాష్ట్రంలో 33.3 శాతం లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ అయ్యాయి. మొత్తం 798 ఆయుధ లైసెన్స్‌లు రద్దయ్యాయి. 669 ఆయుధాలను సీజ్ చేశారు. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలను కలిగి ఉన్న బీహార్‌లో నవంబర్ 6, 11 తేదీలలో రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.

జీవన సౌరభం

జీవితంలో గెలుస్తామా ఓడిపోతామా అనేది ముఖ్యం కాదు. సరైన దారిలో ప్రయాణిస్తున్నామా? లేదా అనేది చాలా ముఖ్యం. గెలుపు కంటే పోరాటం గొప్పది.

మీ కోసం

సాంబారు మరుగుతున్నప్పుడు ఒక చెంచా నిమ్మరసం కలిపితే రుచి పెరుగుతుంది.



దీపావళి

దివ్య దీపావళి భవ్య దీపావళి
వెలుగులు తెచ్చు దీపావళి
జిలుగులు తెచ్చు దీపావళి
బతుకుల్లో కాంతి నింపు దీపావళి
పేదల ఆకలి తీర్చు దీపావళి
నింగిలోని తారలను
నేలకు దించిన దీపావళి
కాంతులు పంచిన దీపావళి

చంటి పాప అల్లరి దీపావళి
పడతి చంకలో పిల్ల దీపావళి
తాత బోసినోటి నవ్వు దీపావళి
జీవిత రంగుల వలయం దీపావళి
ప్రకృతి తల్లీ మాయాజాలం దీపావళి
అమావాస్య అందం దీపావళి
రమ్య రవళి దీపావళి
కమ్మని కవిత దీపావళి

ఆకాశంలో సగం దీపావళి
అతివల అందం దీపావళి
సబలల చాతుర్యం దీపావళి

- రాళ్లబండి సంగం నాయుడు,
జరజాపూపేట,
94909 35268.




స్ఫూర్తి

లోలోన 'తపన'
కాకర వత్తులా కాలాలి!
'లక్ష్యం' చుట్టూ
భూచక్రం లా తిరగాలి!
'గమ్యం' వైపు
రాకెట్‌లా దూసుకుపోవాలి!
'ఫలితం' ఇక
లక్ష్మీ బాంబులా పేలాలి!
'జీవితం'
చిచ్చు బుడ్డిలా వెలగాలి!
ఈ దీపావళి
అందుకు నాంది 'దీపం' కావాలి!

- తిప్పాన హరి రెడ్డి, విజయవాడ,
94938 32412.

నేను గీసిన బొమ్మ





కె. సరళ ఇవంజెలిన్,
7వ తరగతి,
లిటిల్ బడ్స్ స్కూలు,
ఇంద్రపాలెం, కాకినాడ రూరల్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అరుదైన వస్తువులతో చరిత్ర చెప్పే గురువు

ఆయన సేకరించే ప్రతి వస్తువూ చరిత్రను చెబుతుంది. ఒకనాటి కాలానికి చెందిన మనుషుల నైపుణ్యాన్ని, జీవన తీరును, వస్తు వినియోగాన్ని కళ్లకు కట్టినట్టు వివరిస్తోంది. ఈకాలంలోంచి ఆ కాలంలోకి ప్రయాణం చేయిస్తుంది. వివిధ కాలాల్లో వాడిన నాణేలు, కరెన్సీ, వస్తువులు, ప్రఖ్యాత నాయకుల గొంతు రికార్డయిన గ్రామఫోను రికార్డులూ ... ఆయన సేకరణ భాండాగారంలో కొలువై .. చూడటానికి, వినటానికి ఒక చారిత్రక అనుభవాన్ని కలిగిస్తాయి. ఇలా అరుదైన వస్తువులను సేకరించి, వాటి వెనుక ఉన్న చరిత్రను, ప్రయోజనాన్ని వివరించి చెబుతున్నారు కొరుపోలు గంగాధరరావు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని బాపడుపాలెం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ఏదో సరదాగా చేపట్టిన నాణేల సేకరణ ఇప్పుడు ఆయన్ను ప్రపంచం గుర్తించే వ్యక్తిగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులలో మొదటిస్థానంలో నిలిపింది. గత 23 సంవత్సరాలుగా ఆయన విజ్ఞాన దాయకంగా కొనసాగిస్తున్న కృషి, వివరాలు సేకరించేందుకు జరుపుతున్న పరిశోధనలు తను చదువు చెప్పే పిల్లలకు ఎంతో విజ్ఞాన దాయకంగానూ, చరిత్రను తెలుసుకునే విజ్ఞాన గనిగానూ ఉపయోగపడుతున్నాయి.

అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రానికి చెందిన కొరుపోలు వరహాలు, నూకరత్నంల దంపతుల కుమారుడే గంగాధరరావు. ప్రస్తుతం అదే మండలంలోని భరణికం పంచాయతీ బాపడుపాలెం మండల పరిషత్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)గా పనిచేస్తున్నారు. చిన్నప్పుడు పేదరికం తాలూకా ఇబ్బందులు ఆయన ప్రాథమిక విద్యాభ్యాసానికి బ్రేకులు వేశాయి. ఎనిమిదేళ్లపాటు టైలరింగ్ వృత్తి చేశారు. ఆ తర్వాత పదో తరగతి వరకూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. అనంతరం దూరవిద్య ద్వారా డిగ్రీ (బిఏ) పూర్తిచేశారు. 2002 డిఎస్సీలో నెగ్గి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

అచ్యుతాపురం మండలం గొర్లె ధర్మవరం, దోసూరు ప్రాథమిక పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించేవారు. దాతలు, సొంత నిధులతో ఫర్నిచర్, ఆట వస్తువులు, పుస్తకాలు, విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, టైలు, పాదరక్షలు, నోటుపుస్తకాలు తదితర సామగ్రి సమకూర్చారు. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పలు దఫాలుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది.



డిజిటల్ విద్యాబోధన

రైల్వే గేటు వద్ద క్రాసింగ్ చేస్తే జరిగే ప్రమాదాలను తెలియజేస్తూ పిల్లలే రైలుబొమ్మలు, క్రాసింగ్ విషయాలు, ప్రమాదాలు జరిగినట్లుగా యాక్ట్‌చేస్తూ రూపొందించిన వీడియోలను 50 లక్షల మందికిపైగా వీక్షించారు. వ్యవసాయం చేసే రైతులు పాముకాటుకు గురైన సమయంలో ప్రాథమిక చికిత్స అంశాలు, కాట్లకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా క్షేత్రస్థాయి వీడియోలను లక్షలాదిమంది ఆదరించారు. బాలకార్మిక వ్యవస్థ, నిరక్షరాస్యత- అక్షరాస్యత, బాల్యవివాహాలు, భారత రాజ్యాంగం- చట్టాలు- న్యాయవ్యవస్థ, ప్రాథమిక విద్యలోని అన్ని సబ్జెక్టు అంశాలకు సంబంధించిన పలు రకాల వీడియోలు విజ్ఞానదాయకంగా నిలుస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టా, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, థ్రెడ్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇవి పిల్లల సృజనను పట్టిచూపుతున్నాయి.

జిఆర్ యాంటీక్యూస్ ద్వారా ఆయన చేసిన వీడియోలను ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ 15 కోట్ల మంది వరకూ వీక్షించారు. 60 మంది ప్రముఖ శాస్త్రవేత్తల చరిత్రతో ఒక పుస్తకాన్ని రచించారు. బిఎడ్, డిఎడ్ ప్రవేశ పరీక్షల మెటీరియల్‌ను పుస్తకరూపంలో తెచ్చారు. తోటి ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఉత్తర్వులు, వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనల సమూనాలతోపాటుగా ఇతర సమాచారం అందించటం డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. విశాఖ ఇన్ఫో.నెట్ పేరిట వెబ్‌సైట్‌ను కొనసాగిస్తున్నారు.

23 ఏళ్లుగా నాణేల సేకరణతో రికార్డు

గంగాధరరావు చిన్నప్పటి నుంచి నేటి వరకూ 23 ఏళ్లుగా నాణేలు, నోట్ల సేకరణను కొనసాగిస్తూనే ఉన్నారు. తన ఇంటినే పురాతన మ్యూజియంగా మార్చివేసి అందరికీ విజ్ఞానగనిని అందిస్తున్నారు. క్రీ॥శ 3వ శతాబ్ద కాలం నాటి నాణేలు, మౌర్యులు, జైనులు, బౌద్ధులు, చోళులు, పల్లవులు, మొఘల్ చక్రవర్తులు, నిజాం ప్రభువుల కాలంతో పాటుగా ఫ్రెంచి, బ్రిటీషు కాలం నాటి నాణేలు, నోట్లు ఆయన వద్ద ఉన్నాయి. ఇప్పటి వరకూ వాటి సేకరణకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకూ ఖర్చు చేశారు. 1717లో వాడుకలోకి వచ్చిన 90 గ్రాముల రెండున్నర రూపాయల (40 అణాల) రామరాజ్యం చిహ్నంతో ఉన్న నాణేన్ని రూ.7 వేలు పెట్టి కొనుగోలు చేశారు. క్రీ.పూ.327వ శతాబ్దంలో భారతదేశంపై దండెత్తిన సమయంలో ముద్రించిన అలెగ్జాండర్ నాణేలు, షేర్‌షా, కనిష్కుడు, ఈస్టిండియా కంపెనీ నాటి పురాతన నాణేలు, స్వాతంత్ర్యానంతరం వచ్చిన నాణేలన్నింటినీ సేకరించారు. 15వ శతాబ్దం నాటి శ్రీకృష్ణదేవరాయులు కాలం నాటి నాణేలు, 1712లో టిప్పుసుల్తాన్ కాలంనాటి బంగారు నాణేలు, ఔరంగజేబు, విక్టోరియా రాణి కాలంనాటి నాణేలు కూడా ఉన్నాయి. 1618లో అణాలు, 1762లో తయారైన శ్రీరామపట్టాభిషేకం నాణేలు, వివిధ దేశాల్లో దేవతా మూర్తుల చిత్రాలతోపాటు డాలర్ల నాణేలు ఉన్నాయి. పలు దేశాల్లోని వాడుకలోని నోట్లు కూడా సేకరించారు. గతంలో లక్నోకు చెందిన వ్యక్తి 2601 నాణేలు సేకరించి సాధించిన గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును గంగాధరరావు 3301 నాణేలను సేకరించి బ్రేక్ చేశారు.

కరెన్సీ నోట్ల ప్రదర్శనలు

గంగాధరరావు ఉత్తరాంధ్రలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి ప్రాధాన్యం, చారిత్రక నేపథ్యాన్ని వివరించి విజ్ఞానాన్ని పంచుతున్నారు. చేతితో దుస్తులు కుట్టే మిషన్, కిరోసిన్‌తో తిరిగే మిషన్, మొదటిసారి ముద్రించిన రూపాయి, తాళపత్ర గ్రంథాలు, ప్లాస్టిక్ నాణేలు, రాజులు, బ్రిటీష్‌కాలంనాటి నాణేలు, నాడు వినియోగించిన వస్తువులు ఆయన సేకరణ భాండాగారంలో ఉన్నాయి. 35 కేజీల బరువు ఉండే ఫ్యాన్, భారతీయులను శిక్షించటానికి బ్రిటీషు వారు ఉపయోగించిన బ్లేడ్ కొరడా, తాళం కనిపించని కప్పు; గాంధీ, నెహ్రూ, సుబాష్ చంద్రబోస్ స్వరంతో ఉన్న గ్రామ్‌ఫోన్లు ఆయన ప్రదర్శనల్లో ఉంచుతారు. వీటి గురించి తెలుసుకుకోవటానికి విద్యార్థులు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తుంటారు.

సొంత డబ్బుతో విద్యార్థులకు ఆటో

వస్తు సేకరణలోనే కాదు; విద్యార్థులకు తోడ్పాటునివ్వటంలోనూ ఈ మాష్టారు ముందుంటారు. తమ స్కూలు విద్యార్థులను రోజూ తీసుకొచ్చేందుకు ప్రతినెలా రూ.4000 చెల్లిస్తూ అద్దె ఆటో ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన పథకం కోసం విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాసులు సొంత నిధులతో సమకూర్చారు. నోటు పుస్తకాలు అందజేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య బెహరా మెమరీ పవర్‌ని అభివృద్ధి చేసి, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకోవటానికి కృషి చేశారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పేదరికం అడ్డుకాకూడదు

చిన్నతనంలో చదువుకోవటానికి నేను చాలా ఇబ్బందులు పడ్డా. నాలాంటి పరిస్థితి ఎవ్వరికీ రాకూడదనేది నా భావన. అందుకే విద్యార్థుల స్థితిగతులను నిరంతరం పరిశీలిస్తున్నా. ఎక్కడ పనిచేసినా డ్రాపౌట్స్ లేకుండా చూస్తున్నా. పురాతన నాణేలు, నోట్ల ప్రదర్శనలతో చారిత్రక ప్రాధాన్యత తెలియజేయటమే కాకుండా విజ్ఞానదాయకంగా మలుస్తున్నా.



- కొరుపోలు గంగాధరరావు,
ఉపాధ్యాయుడు



నేడు 'తెలుసు కదా' సినిమా విడుదల


సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన చిత్రం 'తెలుసు కదా' శుక్రవారం విడుదల కానుంది. శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా కథానాయికలు. ప్రముఖ స్టైలిస్ట్-ఫిల్మ్‌మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా ఘనంగానే నిర్వహించారు. 'తెలుసుకదా' సినిమాలో రాడికల్, ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేశా. వరుణ్ అనే వింతమనిషి క్యారెక్టరులో ఏడాది ఒదిగా పోవాల్సివచ్చింది. వరుణ్ అనే క్యారెక్టర్ ఒక్క చుక్క రక్తం చిందించకుండా ఎమోషనల్ వార్, సైకలాజికల్ వైలెన్స్‌ని జనరేట్ చేస్తాడు. అది నా ప్రామీస్. బెర్ముడా ట్రయాంగిల్ మీద నుంచి షిప్ వెళ్లిన, ఎయిర్ క్రాఫ్ట్ వెళ్ళినా దానిలోకి లాగేసు కుంటుంది. ఈ సినిమా కూడా అలాంటి లవ్ ట్రయాంగిల్. ఈ సినిమా చూసిన వాళ్ళందరినీ కూడా అది లాగేస్తుంది' అని కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ అన్నారు.

'కాంతారా..' కొత్త ట్రైలర్




రిషబ్ శెట్టి తెరకెక్కించిన 'కాంతార చాప్టర్ 1' అక్టోబర్ 2న విడుదలైంది. ఇప్పటికే అత్యధిక థియేటర్స్‌లో రన్ అవుతున్న ఈ చిత్రం నుంచి తాజాగా కొత్త ట్రైలర్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్‌లో సినిమాలోని కీలక సన్నివేశాలన్నింటిని చూపించారు. యాక్షన్ సీన్లను హైలెట్ చేస్తూ కట్ చేశారు. రిషబ్ శెట్టి స్వీయదర్శకత్వంలో హీరోగా నటించి ఈ చిత్రంలో యువరాణి పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించారు. గుల్షన్ దేవయ్య కీలక పాత్ర పోషించారు. హొంబలే ఫిలింస్ నిర్మించింది.

'మనం' దర్శకుడితో విజయ్ దేవరకొండ!



'మనం', 'గ్యాంగ్ లీడర్', '24' వంటి సూపర్ హిట్ చిత్రాలని తెరకెక్కించిన విక్రమ్ కే కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని సమాచారం. స్టోరీటెల్లింగ్ స్టైల్ ఎమోషనల్ డ్రామా, సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్‌ని తన సినిమాలో ఎక్కువగా చూపించే విక్రమ్‌తో విజయ్ చేయబోయే ప్రాజెక్టు గురించి చిత్రబృందం త్వరలో వివరాలు ప్రకటించనుంది.

'ఖలీఫా' గ్లింప్స్ విడుదల



మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఖలీఫా' సినిమా నుంచి చిత్రబృందం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. 'ది బ్లడ్‌లైన్' అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్‌లో పృథ్వీరాజ్ 'ఆమిర్ అలీ' అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నారు. ఈ సినిమా గోల్డ్ మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుంది. వైశాఖ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జిను వి. అబ్రహం, సూరజ్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జేక్స్ బెజాయ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం ఓనం సందర్భంగా 2026లో విడుదల చేయనున్నారు.

'మైసా'కి జేక్స్ బిజోయ్ మ్యూజిక్

ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న సినిమా 'మైసా'. రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో ఆకట్టుకునేలా ఉన్నాయి. అన్ ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. 'సరిపోదా శనివారం' ఫేం జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తారని మేకర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జేక్స్ బిజోయ్ ట్రైబల్ వాయిద్యాలతో రీరికార్డింగ్ చేస్తున్న వీడియోను విడుదల చేశారు. శ్రేయాస్ పి.కృష్ణ సినిమాటోగ్రఫీగానూ, ఆండి లాంగ్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు.



అభిషేక్, మంధానకు ఐసిసి అవార్డులు

- సెప్టెంబర్ నెలకుగాను 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'కు ఎంపిక





దుబాయ్: టీమిండియా యువ సంచలనం అభిషేక్ శర్మ, మహిళా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన ఐసిసి అవార్డుల్లోనూ సత్తా చాటారు. సెప్టెంబర్ నెలకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును గెలుచుకున్నారు. ఆసియా కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌తో సత్తా చాటిన అభిషేక్ శర్మ ఏడు మ్యాచుల్లో 200 స్ట్రయిక్ రేటుతో ఏకంగా 314 పరుగులు సాధించాడు. ఆసియాకప్‌లో చెలగిపోయిన అభిషేక్ తాజా టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు' కోసం నామినేట్ అయిన అభిషేక్ భారత్‌కే చెందిన కుల్దీప్ యాదవ్, బ్రియాన్ బెన్నెట్(జింబాబ్వే)లను వెనక్కి నెట్టి ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. 'ఐసిసి అవార్డు గెలిచినందుకు చాలా గర్వంగా ఉంది. జట్టు విజయాల్లో భాగమైనందుకు నాకు ఈ అవార్డు దక్కినందుకు చాలా సంతోషపడుతున్నా. కష్ట సమయాల్లోనూ గెలుపు దిశగా సాగిన జట్టులో భాగమైనందుకు గర్వపడుతున్నా. మద్దతుగా నిలుస్తున్న సహచరులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అని అభిషేక్ వెల్లడించాడు.

ఇక మంధాన విషయానికొస్తే.. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు శతకాలు, ఒక అర్ధశతకంతో మెరిసినందుకు మంధానకు ఈ అవార్డు వరించింది. ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో 58, 117, 125 పరుగులతో మెరిసింది మంధాన.. ఓటింగ్‌లో దక్షిణాఫ్రికా సంచలనం తంజిమ్ బ్రిట్స్, పాకిస్తాన్ క్రికెటర్ సిద్రా అమిన్‌లను వెనక్కి నెట్టి అవార్డుకు ఎంపికయ్యారు.

సెమీస్‌కు ఆస్ట్రేలియా

బంగ్లాదేశ్‌పై 10 వికెట్ల తేడాతో గెలుపు
హీలీ శతకం, లిచ్‌ఫీల్డ్ అర్ధ శతకం
ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్




విశాఖపట్నం: ఐసిసి మహిళల ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఈ టోర్నీలో సెమీస్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. బంగ్లా నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని అలీసా హీలీ(113 నాటౌట్), యువకెరటం ఫొబో లిచ్‌ఫీల్డ్ (84 నాటౌట్) అర్ధ శతకంతో మెరవడంతో ఆ జట్టు 24.5ఓవర్లలోనే సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. హీలీ, లిచ్‌ఫీల్డ్‌లు ఈ టోర్నీలోనే తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం. దీంతో ఆసీస్ జట్టు సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకోగా.. వరుసగా నాలుగో ఓటమితో బంగ్లాజట్టు సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. తొమ్మిదో టైటిల్ వేటలో దూకుడు కనబరుస్తున్న ఆసీస్ గురువారం బంగ్లాదేశ్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కెప్టెన్ అలీసా హీలీ శతకగర్జనకు తోడు ఫొబె లిచ్‌ఫీల్డ్ విధ్వంసక బ్యాటింగ్ తోడైంది. ఛేదనలో రెండు ఓవర్లు ఆచితూచి ఆడిన ఓపెనర్లు.. ఆ తర్వాత తమ స్టయిల్లో ఎదురు దాడికి దిగారు. క్రీజులో చురుకుగా కదులుతూ.. ఫ్రంట్‌ఫుట్‌లో ఆడుతూ బౌండరీలు రాబట్టింది లిచ్‌ఫీల్డ్. దాంతో, పవర్ ప్లేలోనే 78 పరుగులు రాబట్టిన ఈ ద్వయం ఆ తర్వాత మరింత రెచ్చిపోయింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను ఆసీస్ బౌలర్లు కట్టడి చేశారు. గార్డినర్, సథర్లాండ్, కింగ్, వారేహామ్ సమిష్టిగా రెండేసి వికెట్లతో రాణించారు. ఇక బంగ్లాదేశ్ బ్యాటర్లలో శోభన(66), హదర్(44) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఈ గెలుపులో ఆస్ట్రేలియా జట్టు 5మ్యాచ్‌లు ముగిసేసరికి 9పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కింగ్‌కు దక్కింది. నేడు కొలంబో వేదికగా శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

పాయింట్ల పట్టిక

	దేశం	ఆ	గె	ఓ	రద్దు	పా	నె.ర.
1.	ఆస్ట్రేలియా	5	4	0	1	9	+1.81
2.	ఇంగ్లండ్	4	3	0	1	7	+1.86
3.	దక్షిణాఫ్రికా	4	3	1	0	6	-0.61
4.	ఇండియా	4	2	2	0	4	+0.68
5.	న్యూజిలాండ్	4	1	2	1	3	-0.24
6.	బంగ్లాదేశ్	5	1	4	0	2	-0.67
7.	శ్రీలంక	4	0	2	2	2	-1.52
8.	పాకిస్తాన్	4	0	3	1	1	-1.88

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్



పెర్త్‌లో కోహ్లీ, రోహిత్ ప్రాక్టీస్

పెర్త్: స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పెర్త్‌లో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. జట్టుతో కలిసి పెర్త్ చేరుకున్న వీరు గురువారం నెట్స్‌లో సాధన చేశారు. పెర్త్‌లో ఆదివారం తొలి వన్డే కోసం విరాట్, హిట్‌మ్యాన్ పెద్ద షాట్లు ఆడుతూ చెమటోడ్చారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఇరువురు.. మునపటి తరహాలో ఆసీస్‌పై చెలరేగిపోవాలనే కసితో ఉన్నారు. సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆటగాడిగా, నాయకుడిగా రోహిత్, విరాట్ విశేష సేవలందించారు. అయితే.. యువతరానికి అవకాశమిస్తూ ఒకరి తర్వాత ఒకరు టి20లు, టెస్టులకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరు కొనసాగుతున్న ఫార్మాట్ వన్డే మాత్రమే. వచ్చే వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనుకుంటున్న ఈ వెటరన్ బ్యాటర్లకు.. ఆస్ట్రేలియా సిరీస్ ఎంతో కీలకం కానుంది. మూడు వన్డేల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడితేనే మరో సిరీస్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాపై రోహిత్, కోహ్లీకు మెరుగైన రికార్డుంది. రోహిత్ 19 మ్యాచుల్లో.. 990 పరుగులు, విరాట్ 18 మ్యాచుల్లో 802 పరుగులు కొట్టారు. ఈనెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68